# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :282 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి ఆదివారం 18 అక్టోబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :282 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SUN 18 OCTOBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## మున్సిపల్ పోరు: టీడీపీ రెండో జాబితా విడుదల.. మచిలీపట్నం మేయర్ అభ్యర్థి ఖరారు

- ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల కోసం టీడీపీ నుంచి మరో జాబితా
- మొత్తం 22 మంది అభ్యర్థుల పేర్లను అధికారికంగా ప్రకటించిన పార్టీ
- మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదా పేరు ఖరారు
- జాబితాలో 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల చైర్‌పర్సన్ అభ్యర్థులు
- తొలి జాబితాలో ఇప్పటికే 36 మందిని ప్రకటించిన టీడీపీ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ తన అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా 22 మందితో కూడిన రెండో జాబితాను శనివారం అధికారికంగా విడుదల చేసింది. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థితో పాటు 21 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్‌పర్సన్ అభ్యర్థుల పేర్లను

- మిగతా 2లో



# నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!

- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన
- రెండు పార్టీలకు గుణపాఠం చెప్పే మూడో ప్రత్యామ్నాయం రావాలన్న విజయసాయి
- నవంబర్ రెండో వారంలో కలుద్దామని, జెన్-జీ సిద్ధంగా ఉండాలని పిలుపు



పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో

- మిగతా 2లో



# ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

## చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ

- ఏపీలో పర్యటించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం
- పులుల సంరక్షణ, అడవి దున్నల తరలింపుపై ఇరువురి మధ్య చర్చ
- త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని తెలిపిన పవన్ కల్యాణ్



పెన్ పవర్ డెస్క్:మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ముందుగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన మోహన్ యాదవ్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు.

- మిగతా 2లో




## పులివెందులలో కాల్పులు.. నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత

- పులివెందులలో స్థానిక ఎన్నికల నామినేషన్ల వద్ద ఉద్రిక్తత
- వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య తోపులాట
- జనాన్ని చెదరగొట్టేందుకు గాల్లోకి పోలీసుల కాల్పులు
- ఆరు రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం
- ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కడప జిల్లా పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు గాల్లోకి ఆరు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో పులివెందులలో

- మిగతా 2లో

## ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

- మిగతా 2లో





## ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది..

## కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు

- రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్
- నామినేషన్ల ప్రక్రియలో టీడీపీ గూండాయిజం చేస్తోందని ఆరోపణ
- పోలీసుల సమక్షంలోనే ఎంపీలపై దాడులు జరిగాయని వెల్లడి
- చంద్రబాబు పాలనలో జంగిల్‌రాజ్ నడుస్తోందని విమర్శ

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం పూర్తిగా కుప్పకూలిపోయిందని, ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే ఖూనీ చేస్తున్నారని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ హింసకు పాల్పడుతోందని ఆరోపిస్తూ, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు.

- మిగతా 2లో

## దాండియా సంబరాల్లో అపశ్రుతి: విద్యార్థిని దుర్మరణం..

# ఐదుగురి పరిస్థితి విషమం

- ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ దాండియా వేడుకల్లో భారీ ప్రమాదం
- లైటింగ్ స్టాండ్ విద్యార్థులపై కూలడంతో వనపర్తికి చెందిన సోనీ అనే విద్యార్థిని మృతి
- సుమారు 25 మంది విద్యార్థులకు గాయాలు.. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలినట్లు ప్రాథమిక అంచనా
- ప్రమాదంపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం



పెన్ పవర్ డెస్క్: హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న 'సంగమం-2026' టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది.

- మిగతా 2లో

## నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



- ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలుల హెచ్చరిక
- ఉత్తర తమిళనాడు తీరంపై కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- హైదరాబాద్ సహా అనేక జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ

పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది.ఉత్తర తమిళనాడు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.

- మిగతా 2లో

## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- నిరసన యాత్రకు ముందు దీప్కేను అదుపులోకి తీసుకున్న ఢిల్లీ పోలీసులు
- బెయిల్ ఇచ్చిన మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు
- రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశం
- ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని షరతు
- కన్నాట్ ప్లేస్‌లో నిరసన యాత్రకు అనుమతి నిరాకరించిన పోలీసులు



పెన్ పవర్ డెస్క్:కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు న్యూఢిల్లీలోని మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన న్యాయస్థానం, ఆయన విడుదలకు మార్గం సుగమం చేసింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 ప్రకారం, ఏడాది పాటు శాంతిభద్రతలకు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# రెయిన్ డేస్...

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో రాబోయే రోజుల్లో వానలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నేడు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వానలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే తేలికపాటి వానలు పడతాయని, మోస్తరు వానలు తప్పించి భారీ వర్షాలు పడవని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల బలమైన ఈదురుగాలులు వీస్తాయని, గంటలకు నలభై నుంచి యాభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల పిడుగులు పడే అవకాశముందని కూడా వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ పేర్కొంది. రానున్న నాలుగు రోజుల పాటు వానలు పడతాయని తెలిపింది.

**అక్కడకక్కడ తెలంగాణలో వానలు...**

తెలంగాణలో నేడు అక్కడకక్కడ వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తాయని, పిడుగులు పడతాయని చెప్పింది. కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన ఉరుములు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా పెద్దపల్లి, భూపాలపల్లి, సిద్దిపేట, వరంగల్, రంగారెడ్డి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో వర్షాలు పడే సూచనలు ఉన్నాయని తెలిపింది. హైదరాబాద్ లోపగటి ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగా నమోదయినా, రాత్రి వేళ వాతావరణం చల్లబడే అవకాశముందని తెలిపింది. పగటిపూట ఉష్ణోగ్రతలు సుమారు 31 డిగ్రీల నుంచి 33 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు.

**ఏపీలో ఉరుములు, మెరుపులతో ...**

ఆంధ్రప్రదేశ్ లో వాతావరణం పై అమరావతి వాతావరణ శాఖ కీలక అప్ డేట్ ఇచ్చింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమల్లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు లేదా పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. అమరావతి, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 30డిగ్రీల నుంచి 31 డిగ్రీల మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రధానంగా రైతులు, పశువుల కాపర్లు పొలాల్లోకి వెళ్లినప్పుడు చెట్ల కింద, విద్యుత్తు స్థంభాల కింద నిలబడవద్దని కూడా వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు: టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు.స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు.నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు,

రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి

ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

# మున్సిపల్ పోరు: టీడీపీ రెండో జాబితా విడుదల.. మచిలీపట్నం మేయర్ అభ్యర్థి ఖరారు

- మొదటి పేజి తరువాయి

ఈ జాబితాలో ఖరారు చేసింది. పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ఈ ప్రకటన వెలువడింది.ఇటీవలే 36 మందితో తొలి జాబితాను ప్రకటించిన టీడీపీ, తాజాగా రెండో జాబితాను విడుదల చేయడంతో ఎన్నికల బరిలో దూకుడు పెంచినట్లయింది. ఈ జాబితాలో కీలకమైన మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబిదాను ఎంపిక చేసింది. క్షేత్రస్థాయిలో పార్టీ అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అభ్యర్థులను ముందుగానే ప్రకటించడం ద్వారా వారికి ప్రచారానికి తగినంత సమయం ఇవ్వడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు టీడీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఈ రెండు జాబితాలతో కలిపి టీడీపీ ఇప్పటివరకు మొత్తం 58 స్థానాలకు తమ అభ్యర్థులను ప్రకటించినట్లయింది.

**ఖరారైన అభ్యర్థుల పూర్తి జాబితా:**

మున్సిపల్ కార్పొరేషన్ (1):
మచిలీపట్నం: షేక్ అబ్దుల్ అబిదా
మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీలు (21):
ఆకివీడు: నిలోఫర్ షేక్
బేతంచెర్ల: ఐ. లోకేశ్ గౌడ్
చీరాల: యెరిచర్ల హనీ స్పందన
బుచ్చిరెడ్డిపాలెం: దొడ్ల విజయలక్ష్మి
డోన్: కోట్ల సుజాతమ్మ
గుత్తి: గోవిందరాజులు తమిళ్ సెల్వి
గుంతకల్లు: యశోద
జంగారెడ్డిగూడెం: రొంగల అనుష
కదిరి: షేక్ సమీరా
కళ్యాణదుర్గం: బుట్న లక్ష్మి
కొండపల్లి: కన్నెకంటి అమూల్య
కొవ్వూరు: జొన్నలగడ్డ రాధారాణి
నాయుడుపేట: షకీరా
నందిగామ: శాకమూరి వంశీధర్
నందికొట్కూరు: ఈ.ఎం. సబురున్నిసా
నర్సీపట్నం: చింతకాయల పద్మావతి
ప్రొద్దుటూరు: నంద్యాల రాఘవరెడ్డి
వెంకటగిరి: దొంతు శారద
ఉయ్యూరు: చేదుర్తిపాటి ప్రవీణ్ కుమార్
ఏలేశ్వరం: యార్లగడ్డ అక్షిత
ఎమ్మిగనూరు: మాచాని సునీత

ఈ జాబితాలో మహిళలకు, యువతకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన మున్సిపాలిటీలకు అభ్యర్థులను ప్రకటించడం ద్వారా అన్ని ప్రాంతాల్లో ఎన్నికలకు సిద్ధమవుతున్నామనే సంకేతాలను పార్టీ పంపింది. మిగిలిన స్థానాలకు కూడా త్వరలోనే అభ్యర్థులను ఖరారు చేసి, పూర్తిస్థాయిలో ఎన్నికల ప్రచారంలోకి దిగాలని టీడీపీ అధిష్ఠానం భావిస్తోంది.

## దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం..

# ఐదుగురి పరిస్థితి విషమం

- మొదటి పేజి తరువాయి

వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది.ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బాధితులను ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, అలాగే అదభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.భారీ ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు

కూడా చెలరేగడంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

## ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం కుప్పకూలిపోయింది..

# కత్తులు, కర్రలతో మా వాళ్లను వెంటాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలకు గూండా లైసెన్స్‌లు ఇచ్చి, వారికి అండగా పోలీసు యంత్రాంగాన్ని వాడుకుంటున్నారని జగన్ ఆరోపించారు. "రాజకీయ హింసావాదిగా తన చరిత్రను మరోసారి చాటుకుంటూ రాష్ట్రంలో జంగిల్‌రాజ్‌ను నడిపిస్తున్నారు. ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయలేని దుస్థితి సృష్టించారు" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. వైసీపీ అభ్యర్థులను పోలీసుల సమక్షంలోనే కత్తులు, కర్రలతో వెంటాడుతున్నారని, నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళ అభ్యర్థులను పోలీసులు అక్రమంగా ఎత్తుకెళుతున్నారని, ఇదే చంద్రబాబు మార్కు ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు.ఈ దాడుల్లో తమ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీలు కూడా బాధితులయ్యారని జగన్ తెలిపారు. అభ్యర్థులకు ప్రపోజర్లుగా వెళ్లిన ఎంపీలపై పోలీసుల సమక్షంలోనే దాడులు జరిగాయని, వారి చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాక్కుని చించేశారని వివరించారు. "ఎంపీలకే రక్షణ లేని రాష్ట్రంలో సామాన్యుల పరిస్థితి ఏమిటి?" అని నిలదీశారు. కడప, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, రాయచోటి, పుంగనూరు, తిరుపతి, దర్శి, గురజాల సహా రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇవి చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఎంతగా దిగజారిపోయిందో చూపుతున్నాయని అన్నారు.పులివెందులలో పోలీసులు జరిపిన కాల్పులు ప్రజాస్వామ్యంపై పేల్చిన తూటాలని, దీని వెనుక చంద్రబాబు కుట్ర ఉందని జగన్ ఆరోపించారు. నామినేషన్ వేయడానికి వచ్చిన వారిపై పోలీసులు ఎందుకు దాడి చేశారని, ఎందుకు కాల్పులు జరిపారని ప్రశ్నించారు. "నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడం ఎన్నికలా? ప్రతిపక్ష అభ్యర్థులను పోలీసులతో ఎత్తుకెళ్లడం ప్రజాస్వామ్యమా? ఎంపీలపైనే దాడులు చేయించడం రాజ్యాంగ పాలనా?" అని చంద్రబాబును ఉద్దేశించి జగన్ ప్రశ్నల వర్షం కురిపించారు.

రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ఈ పరిస్థితుల్లో కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "సూపర్ 6, సూపర్ 7ల మోసాలతో ప్రజలకు బాండ్లు ఇచ్చి మరీ మోసం చేసిన ఈ వెన్నుపోటు పార్టీ నుంచి ఇంతకన్నా ఏమి ఆశించగలం!" అని జగన్ తన పోస్టును ముగించారు.

# సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు షరతులతో బెయిల్

- మొదటి పేజి తరువాయి

విఘాతం కలిగించకూడదన్న షరతుకు ఆయన కట్టుబడి ఉండాల్సి ఉంటుంది.

ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో సీజేపీ తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' నిరసన యాత్రకు ముందు, శుక్రవారం ఢిల్లీ పోలీసులు ఆయనను ముందుజాగ్రత్త చర్యగా అదుపులోకి తీసుకున్నారు. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 126, 170 కింద ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ నిరసన యాత్రకు ముందు సుమారు 20 మందికి పైగా పోలీసులు దీప్కే నివాసానికి వెళ్లి ఆయనకు రెండు నోటీసులు అందజేశారు. కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం వల్ల తొక్కిసలాట జరిగే అవకాశం ఉందని, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే ప్రమాదం ఉన్నందున అక్కడ నిరసనలు చేపట్టరాదని ఒక నోటీసులో పేర్కొన్నారు. గతంలో సమర్పించిన బాండ్ షరతులను ఉల్లంఘిస్తున్నారని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జారీ చేసిన రెండో నోటీసులో పోలీసులు హెచ్చరించారు.

అక్టోబర్ 10న కూడా దీప్కే, ఆయన సహచరులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు ముందుజాగ్రత్తగా అదుపులోకి తీసుకున్నారు. ఏడాది పాటు శాంతియుతంగా

ఉంటామని హామీ ఇస్తూ, ఒక్కొక్కరు రూ. 50,000 పూచీకత్తు సమర్పించి వారు విడుదలయ్యారు. సీజేపీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో 'లెహ్రా దో తిరంగా' యాత్రను నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నందున, ఢిల్లీ పోలీసులు ఈ యాత్రకు అనుమతి నిరాకరించారు.

# ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

- మొదటి పేజి తరువాయి

అనంతరం నేతలు కాసేపు ముచ్చటించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మోహన్ యాదవ్ సమావేశమ య్యారు. ఈ భేటీలో ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల కు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంరక్షణ చర్యలను బలోపేతం చేయడంపై మాట్లాడారు. అలాగే, జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్ నుంచి గౌర్ (అడవి దున్నలు)ను చీూ=కు తరలించే ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. ఈ సందర్భంగా త్వరలోనే తాను మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని పవన్ తెలిపారు.సమావేశం అనంతరం పవన్ కల్యాణ్.. మోహన్ యాదవ్‌ను ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించి, కొండపల్లి, శ్రీకాళహస్తి కళాకృతులతో పాటు అరకు కాఫీని బహూకరించారు. ప్రతిగా మోహన్ యాదవ్, శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదాన్ని పవన్‌కు అందజేశారు.

# పులివెందులలో కాల్పులు.. నామినేషన్ల వేళ తీవ్ర ఉద్రిక్తత

- మొదటి పేజి తరువాయి

ఒక్కసారిగా కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల కోసం పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు నామినేషన్ కేంద్రానికి చేరుకున్నారు. అయితే, అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నేతలను ముందుగా లోపలికి అనుమతిస్తామని పోలీసులు చెప్పడంతో వివాదం మొదలైంది. పోలీసుల నిర్ణయంతో ఆగ్రహించిన వైసీపీ కార్యకర్తలు ఒక్కసారిగా ముందుకు దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది.పరిస్థితి చేయిదాటిపోతుండటంతో గుంపును చెదరగొట్టి, శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య నెలకొన్న తీవ్రమైన రాజకీయ పోటీయే ఈ ఉద్రిక్తతలకు కారణమని తెలుస్తోంది. ఘటన అనంతరం పులివెందులలో భారీగా పోలీసులను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టారు.

# నేటి నుంచి వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

- మొదటి పేజి తరువాయి

దీని ప్రభావంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షంతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.రేపు (అక్టోబర్ 18) హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!

- మొదటి పేజి తరువాయి

ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్–జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. "ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!" అంటూ తన పోస్టును ముగించారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

## బుక్కాపురం ఎస్సీ కాలనీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, అక్టోబర్ 17 :**
నాదెండ్ల మండల పరిధిలోని బుక్కాపురం పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీటీసీ పోలింగ్ కేంద్రం (బూత్ నెంబర్ 35/63)ను అధికారులు పరిశీలించారు. రూరల్ సీఐ సుబ్బ నాయుడు, నాదెండ్ల ఎస్సై వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ కలిసి కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం జరిగేలా అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటర్లకు తగిన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

## పోలింగ్ విధులపై పూర్తి అవగాహనతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ





**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 17:**
స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలింగ్ సిబ్బంది పూర్తి స్థాయిలో శిక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ సి యం. సాయికాంత్ వర్మ సూచించారు. శనివారం గుంటూరు నగరంలోని ఏసీ కాలేజీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ప్రభుత్వ మహిళా కళాశాలలో జరుగుతున్న పోలింగ్ సిబ్బంది శిక్షణా తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ విధులకు సంబంధించి సిబ్బంది తమ సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. సంబంధిత ఎన్నికల మెటీరియల్‌ను క్షుణ్ణంగా చదివి, పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అశ్రద్ధకు తావులేకుండా, నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్, ఇతర అధికారులు ఉన్నారు.

## కొర్నిపాడు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన జె.సి



**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 17 :**
వట్టిచెరుకూరు మండలం కొర్నిపాడు పోలింగ్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ శనివారం తనిఖీ చేశారు. జిల్లాలో ప్రశాంతంగా, సజావుగా ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఇందులో భాగంగా సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను, సమస్యాత్మక కేంద్రాలను కూడా గుర్తించడం జరుగుతుందని అన్నారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఉంటే ముందే జిల్లా ఎన్నికల యంత్రాంగానికి తెలియజేయాలని తద్వారా వాటిని తక్షణం పరిష్కరించుటకు చర్యలు చేపడతామని తెలిపారు. చక్కని వాతావరణంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగి ఆదర్శ ఆదర్శవంతంగా జిల్లా నిలవాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను గుర్తించినా, ఎన్నికలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ప్రశ్నలు ఉన్నా, వాటిపై ఫిర్యాదులు చేసేందుకు లేదా వివరాలు తెలుసుకునేందుకు 08632 234014 హెల్ప్‌డెస్క్/కాల్ సెంటర్ ఫోన్ నంబర్‌ను సంప్రదించవచ్చని వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రాథమిక సౌకర్యాలు ఉండాలని మండల అధికారులను ఆదేశించారు. విద్యుత్తు, సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ తదితర అంశాలపట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని చెప్పారు. వార్డుల వారీగా పోలింగ్ బూతులు ఏర్పాటు పక్కాగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు వచ్చే సిబ్బందికి సమస్యలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ పట్ల ఎక్కడా నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు ఆదేశించారు.

## ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా సెక్షన్ 30 అమలు అనుమతి లేకుండా సభలు, ఊరేగింపులు, రోడ్‌షోలు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్పీ బి. ఉమామహేశ్వర్



**బాపట్ల, అక్టోబర్ 17 (పెన్ పవర్):**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత దృష్ట్యా బాపట్ల జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.రాబోయే పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నిర్వాహకులు, వారి ప్రతినిధులు బహిరంగ సభలు, ఊరేగింపులు, రోడ్‌షోలు నిర్వహించాలన్నా, మైకులు, లౌడ్‌స్పీకర్లు, డ్రోన్ కెమెరాలను వినియోగించాలన్నా సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కర్రలు, ఆయుధాలు, ఇతర ప్రమాదకర వస్తువులను వెంట తీసుకెళ్లడం, నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది చట్టవిరుద్ధంగా గుమిగూడడం నిషేధమని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, కమ్యూనిటీ నాయకులు, ప్రజలు పోలీస్ శాఖ జారీ చేసిన ఉత్తర్వులు, నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను ఉపేక్షించబోమని, అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, జిల్లా ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.జిల్లాలో ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు, పోలీస్ అధికారులకు లేదా 112 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

## గుంటూరు జిల్లాలో పరిశ్రమను తనిఖీ చేసిన కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్




**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 17,**
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఈ రోజు గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం తక్కెళ్లపాడు గ్రామంలోని జయరాజ్ ఫార్చ్యూన్ ప్యాకేజింగ్స్ పరిశ్రమను తనిఖీ చేశారు.ఈ తనిఖీలో గుంటూరు ప్రాంతీయ పర్యావరణ ఇంజినీర్ ఎం.డి. నజీనా బేగంతో పాటు ప్రాంతీయ కార్యాలయ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఛైర్మన్ పరిశ్రమ ప్రాంగణాన్ని పరిశీలించి, ముడి పదార్థాల వినియోగం, అట్టపెట్టెల తయారీ ప్రక్రియను సమీక్షించారు. అనంతరం పరిశ్రమలో ఏర్పాటు చేసిన వ్యర్థ జలాల శుద్ధి కేంద్రం, ఆవిరి ఉత్పత్తి యంత్రం నిర్వహణ, వాయు కాలుష్య నియంత్రణ వ్యవస్థలు, ఘన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను పరిశీలించారు.
అనంతరం ప్రాంతీయ పర్యావరణ ఇంజినీర్ నజీనా బేగం పరిశ్రమలో అమలవుతున్న తయారీ విధానాలు, కాలుష్య నియంత్రణ పరికరాల పనితీరు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఛైర్మన్‌కు వివరించారు.పరిశ్రమలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఛైర్మన్, పరిశ్రమ కార్యకలాపాలు పర్యావరణ ప్రమాణాలకు, కాలుష్య నియంత్రణ నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతున్నాయా అనే అంశాలను సమీక్షించారు. పరిశ్రమల నిర్వహణలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ తనిఖీ సందర్భంగా పరిశీలించారు.

## నామినేషన్ల స్వీకరణకు విశేష స్పందన వార్డు సభ్యుల స్థానాలకు 74.. చైర్‌పర్సన్‌కు 3 నామినేషన్లు

**చీరాల, అక్టోబర్ 17 (పెన్ పవర్):**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో చైర్‌పర్సన్, వార్డు సభ్యుల పదవులకు శనివారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా మొత్తం 77 నామినేషన్లు దాఖలయ్యాయి.వార్డు సభ్యుల పదవులకు 74 నామినేషన్లు, చైర్‌పర్సన్ పదవికి 3 నామినేషన్లు దాఖలయ్యాయి. చైర్‌పర్సన్ పదవికి దాఖలైన నామినేషన్లలో స్వతంత్ర అభ్యర్థి ఒకరు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఒకరు, కాంగ్రెస్ పార్టీ తరఫున ఒకరు ఉన్నారు. మొత్తంగా శనివారం వార్డు సభ్యుల పదవులకు 74, చైర్‌పర్సన్ పదవికి 3 నామినేషన్లు దాఖలు కావడంతో ఎన్నికల ప్రక్రియలో రాజకీయ సందడి నెలకొంది.




## గుంటూరులో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలకు శిక్షణ ఎన్నికల ఖర్చుల వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలి



**గుంటూరు: పెన్ పవర్, అక్టోబర్, 17,**
నగరంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నమూనాలోనే సమర్పించాలని లెక్కల పరిశీలకులు ఎలీషా సూచించారు.శనివారం నగర కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కె. మయూర్ అశోక్ ఆదేశాల మేరకు గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ పర్యవేక్షణ బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎలీషా మాట్లాడుతూ, ఎన్నికలను పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు వ్యయ పరిశీలకులు, లెక్కల నమోదు బృందాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభ్యర్థులు ప్రచార సామగ్రి, కార్యకర్తల ప్రచారం, వాహనాల వినియోగం తదితర ఖర్చులన్నింటినీ నిర్దేశిత నమూనాలో నమోదు చేయాలన్నారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 45 రోజుల్లోగా పూర్తి ఎన్నికల వ్యయ వివరాలను ఎన్నికల అధికారులకు సమర్పించాలని స్పష్టం చేశారు.ఎన్నికల ఖర్చులను పరోక్షంగా పర్యవేక్షించి, షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. అభ్యర్థులు సమర్పించే ఖర్చుల వివరాలను ఈ రిజిస్టర్‌తో సరిపోల్చి, వ్యయ లెక్కల్లో పారదర్శకతను నిర్ధారించాలని సూచించారు.అలాగే ఎన్నికల వ్యయ పర్యవేక్షణలో పాల్గొనే వివిధ బృందాల విధులు, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల నియమావళి ప్రకారం పాటించాల్సిన అంశాలు, చేయకూడని పనులపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో అకౌంట్స్ అధికారి తిరుపతి నాయుడు, సహాయ లెక్కల పరిశీలకులు తిరుపతయ్య, జిల్లా ఆడిట్ అధికారి శ్రీకాంత్, నగర పాలక సంస్థ సిబ్బంది, వ్యయ పరిశీలకులు, లెక్కల నమోదు బృందాల సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల సామగ్రి పంపిణీ, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కమిషనర్ కె. మయూర్ అశోక్



**గుంటూరు,పెన్ పవర్,అక్టోబర్ 17:**
గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక ఎన్నికల నిర్వహణకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లను వేగవంతం చేయాలని నగర కమిషనర్, అదనపు ఎన్నికల ప్రాధికార సంస్థ అధికారి కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు.ఎన్నికలనుఅత్యంతపటిష్టంగా,పారదర్శకంగా నిర్వహించేందుకుఅన్నివిభాగాలఅధికారులుసమన్వయంతో పనిచేయాలని సూచించారు.శనివారం ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా నగర కమిషనర్ గుంటూరులోని ఆంధ్రా ముస్లిం కళాశాలను ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంగా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని ఓట్ల లెక్కింపు కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ కె. మయూర్ అశోక్ మాట్లాడుతూ.. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని 76 వార్డులకు సంబంధించి 596 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రిని రిటర్నింగ్ అధికారుల వారీగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి తరలించేందుకు వచ్చే బస్సులకు అనువైన మార్గాలు ఏర్పాటు చేయడంతో పాటు, విధుల్లో పాల్గొనే సిబ్బందికి భోజన సదుపాయాలు కల్పించాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులకు సూచించారు.ఎన్నికల పోలింగ్ పూర్తయిన అనంతరం బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని, ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన బారికేడ్లు, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.అలాగే పట్టణ సర్వేయర్ల సమన్వయంతో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు సంబంధించిన సమగ్ర పటాలను సిద్ధం చేయాలని నగర ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్ పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతిబసు, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ. కిషోర్, ఉప కమిషనర్ బి. శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజినీర్ జి. వెంకటేశ్వరరావు, నగర ప్రణాళిక అధికారి డి. రాంబాబు, సర్వేయర్లు లక్ష్మీనారాయణ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్



# చిన్నారులకు అక్షరాభ్యాసం, పుస్తకాల పంపిణీ డాక్టర్ నాతాని శ్రీకాంత్, హిమబిందు






**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 17,**

గుంటూరు రైతు బజార్ త్రిశక్తి దేవస్థానంలో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలనే లక్ష్యంతో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. సీవీఆర్ ఆసుపత్రుల అధినేత డాక్టర్ నాతాని శ్రీకాంత్, హిమబిందు దంపతుల చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడంతో పాటు, వారికి పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాలు దిద్దించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. అనంతరం పిల్లలకు పుస్తకాలను అందించి, చదువుపై ఆసక్తిని పెంపొందించేలా ప్రోత్సహించారు. చిన్నతనం నుంచే విద్య పట్ల మక్కువ పెంచుకోవాలని, క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

విద్య అనేది ప్రతి చిన్నారి జీవితంలో వెలుగులు నింపే అమూల్యమైన సంపద అని, బాల్యంలోనే విద్యకు పునాది పడితే భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చిన్నారులకు అక్షరజ్ఞానాన్ని అందించడంతో పాటు, అవసరమైన పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ నాతాని శ్రీకాంత్, హిమబిందు దంపతుల చేతుల మీదుగా జరిగిన ఈ అక్షరాభ్యాసం, పుస్తకాల పంపిణీ కార్యక్రమం చిన్నారుల్లో ఆనందాన్ని నింపింది. విద్యా ప్రస్థానంలో తొలి అడుగు వేసిన చిన్నారుల భవిష్యత్తు సుఖసంతోషాలతో, విజయాలతో నిండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు

# ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలి

**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 17 :**

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ చానల్స్, కేబుల్ చానెల్, సినిమా హాల్ తదితర ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సంబంధించి అభ్యర్థులు మీడియా సర్టిఫికేషన్ మరియు మీడియా మానిటరింగ్ (ఎం.సి.ఎం.సి) టీమ్ కు కనీసం మూడు రోజులు ముందుగా చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ప్రకటన ఇవ్వదలిచిన విషయంగల వీడియో, అందులోని అంశాలకు సంబంధించిన స్క్రిప్ట్, సమయం, తయారీ ఖర్చు, ఏ మీడియాలో ప్రసారం చేస్తున్నారు, అందుకు జరిగే వ్యయం తదితర అంశాలను సమర్పించాలని చెప్పారు. ప్రసారం చేసే వీడియోలో ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా మాత్రమే ఉండాలని అన్నారు. ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా లేని ప్రకటనలకు అనుమతులు జారీ ఉండదన్నారు. ప్రింట్ మీడియా, సోషల్ మీడియాలో ప్రకటనలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఖర్చులు అభ్యర్థుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎం.సి.ఎం.సి టీమ్ పెయిడ్ న్యూస్ ను కూడా పర్యవేక్షణ చేయడం జరుగుతుందని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే విషయాలను సైతం పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయడం



జరుగుతుందని తెలిపారు. ఎస్.ఎం.ఎస్ రూపంలో ఇచ్చే మెసేజ్ లకు, వాయిస్ మెసేజ్ లకు కూడా అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజు ఇచ్చే ప్రింట్ మీడియా ప్రకటనలకు కూడా అనుమతులు తప్పనిసరి అన్నారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని కోరారు. పోస్టర్లు, కరపత్రాలు ముద్రిస్తే వాటి సంఖ్య, ఖర్చు, ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా మాత్రమే ముద్రించినట్టు ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలని స్పష్టం చేశారు.

# చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ ఇస్త్రాల్ల షెర్లి నామినేషన్



**చీరాల, అక్టోబర్ 17 (పెన్ పవర్):**

చీరాల మున్సిపల్ చైర్మన్ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ ఇస్త్రాల్ల షెర్లి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. చీరాల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన నామినేషన్ కార్యక్రమానికి చీరాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై షెర్లికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొని డాక్టర్ ఇస్త్రాల్ల షెర్లికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం సందర్భంగా పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## 160 ఏళ్ల నగర విస్తరణ పట్ల హర్షం

# 6విలీన గ్రామాలు 66 డివిజన్లతో 2027 ఫిబ్రవరిలో కార్పొరేషన్ ఎన్నికలు జరుగుతాయి

**గ్రేటర్ దిశగా కాకినాడ దూసుకుపోతుంది పౌరసంక్షేమసంఘం**





**పెన్ పవర్, అక్టోబర్ 17 :**

160 ఏళ్ల నాటి కాకినాడ నగరం విజయ దశమి సందర్భంగా విస్తరణ చెందే దిశగా తొలి అడుగులు వేసే అవకాశం వచ్చిందని పౌర సంక్షేమం సంఘం పేర్కొంది.

2017లో నాడు స్వామి నగరం గంగనాపల్లి ఎస్ అచ్యుతాపురం గ్రామాల నుండి విలీనం అయిన 42,48 డివిజన్లకు వ్యతిరేకంగా ఏర్పడిన రిట్ పిటిషన్లు 2026 అక్టోబర్ 16న హైకోర్టు ధర్మాసనం డిస్మిస్ చేయడం అభినందనీయమని పౌర సంఘం కన్వీనర్ ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు.

ఆలస్యం అయినప్పటికీ తగిన సమయం లో వెలువడిన కోర్టు నిర్ణయం ప్రభుత్వ చొరవ పట్ల పౌర సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది.

తూరంగి ఇంద్రపాలెం చీడిగ వాకలపూడి వలసపాకల రమణయ్యపేట 6 గ్రామాలు గవర్నర్ ఆర్డినెన్స్ ప్రకారం పంచాయితీ రాజ్ నుండి వేరు చేసిన దృష్ట్యా ప్రభుత్వం అప్పట్లో ఇచ్చిన జీవో మీద 3 రిట్ పిటిషన్లు దాఖలు కావడం వలన జీవో రద్దు మాత్రమే జరిగిందని ఆర్డినెన్స్ అమల్లోనే వుందన్నారు. ఈ కారణంగా వాటికి పంచాయితీ ఎన్నికలు నిర్వహించే అవకాశం శాశ్వతంగా లేదన్నారు.

విలీన 6గ్రామాలు లేకుండా కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించే వీలు చట్టబద్ధంగా లేదన్నారు. చట్ట రీత్యా పంచాయతీ రాజ్ తుది రిపోర్టింగ్ అడ్వకేట్ జనరల్ నివేదిక తో 3 రిట్ పిటిషన్లు డిస్మిస్ కాబడడం ప్రభుత్వం కొత్తగా జీవో ఇవ్వడం ద్వారా 6 గ్రామాల ఆస్తులు అప్పులు సిబ్బంది కార్పొరేషన్ పాలనలోకి చేరతాయన్నారు. తద్వారా విలీన గ్రామాలతో జరిగే 66 డివిజన్ల విభజనతో కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం అవుతుందన్నారు. భవిష్యత్తు లో గ్రేటర్ దిశగా కాకినాడ దూసుకుపోతుందన్నారు.

కొత్త భౌగోళిక సరిహద్దులను సిద్ధం చేయడానికి రూల్ ప్రకారం 21 అభ్యంతరాలకు 7 పరిష్కారాలకు 2 వంతున 30 రోజులు కేటాయించి ఫైనల్ గెజిట్ నోటిఫికేషన్' తెచ్చి ఎన్నికలు పూర్తి చేస్తారన్నారు. 2027 ఫిబ్రవరి లో కాకినాడ నగర పాలక సంస్థ నూతన పాలక వర్గం ప్రమాణ స్వీకరణ జరిగే విధంగా ఎన్నికలు జరుగుతాయన్న ధీమా వ్యక్తం చేశారు.

విజయదశమి అనంతరం 160 ఏళ్ల కాకినాడ నగర తొలి విస్తరణ చర్యల దృష్ట్యా అఖిలపక్షం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిని అభినందన నందన పూర్వకంగా కలిసే కార్యాచరణ జరుగుతుందని రమణరాజు తెలిపారు.

# వేద పాఠశాలలో డాక్టర్ జాన్ దేవిడ్ అయ్య శతజయంతి వేడుకలు.. పేదల సేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయం.

**చిలకలూరిపేట , పెన్ పవర్, అక్టోబర్ 17 :**

పట్టణంలోని వేద పాఠశాలలో ఏఎంజీ సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ జాన్ డేవిడ్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ శ్రీగిరి డేవిడ్ స్నేహల్, సీఈఓ శామ్యూల్ రాజు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సత్య దీప్తి పుష్పమాలలు వేసి ఘనంగానివాళు లర్పించారు.అనంతరం డేవిడ్ అయ్య సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ శ్రీగిరి డేవిడ్ స్నేహల్ మాట్లాడుతూ, డాక్టర్ జాన్ డేవిడ్ అయ్య స్థాపించిన ఏఎంజీ సంస్థలు పేదల పాలిట పెన్నిధిగా నిలిచాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం తదితర రంగాల్లో సంస్థలు అందిస్తున్న సేవలు ఎంతోమందినిరుపేదలకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు.సీఈఓ శామ్యూల్ రాజు



మాట్లాడుతూ, డేవిడ్ అయ్య సేవలను మాటల్లో వర్ణించడం అనితర సాధ్యమని అన్నారు. ఆయన నిరాడంబర జీవితం, నిస్వార్థ సేవాభావం, మానవతా దృక్పథం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు.అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సత్య దీప్తి మాట్లాడుతూ, చిలకలూరిపేట ప్రజల దాహార్తిని తీర్చిన అపర భగీరథుడిగా, పేద విద్యార్థుల జీవితాల్లో ఆశాదీపంగా డాక్టర్ జాన్ డేవిడ్ అయ్య నిలిచిపోయారని పేర్కొన్నారు.ఆయన చేసిన సేవలు అపారమైనవని, పట్టణ ప్రజల హృదయాల్లో ఆయన ఎప్పటికీ చిరస్మరణీయుడిగా నిలుస్తారని అన్నారు.కోఆర్డినేటర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వర్షిని మాట్లాడుతూ, డాక్టర్ జాన్ డేవిడ్ అయ్య సేవల గురించి తెలియని వారు ఉండరని, ఆయన నిరాడంబర జీవితం, సేవా తత్పరత అందరికీ ఆదర్శమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని డాక్టర్ జాన్ డేవిడ్ అయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను, సేవా స్ఫూర్తిని స్మరించుకున్నారు.

# మూడు దశల్లో సమగ్ర భూసర్వే
## 285 గ్రామాల్లో సర్వే పూర్తి.. అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ

**-వచ్చేనెల చివరినాటికి మొదటి దశ పూర్తికి సన్నాహాలు**
**-మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారు**
**-పాలేరు నియోజకవర్గంలో త్వరలో భూదార్ పట్టాల పంపిణీ**
**-రెవెన్యూ అధికారుల సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**పెన్ పవర్, అక్టోబర్ 17 :**

రాష్ట్రంలో భూ సమస్యలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతూ ప్రతి భూకమతానికి కచ్చితమైన హద్దులు నిర్ణయించి, భూ యాజమాన్య హక్కులపై స్పష్టత కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను మూడు దశల్లో పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఇప్పటికే 285 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి చేసి భూ యజమానుల నుంచి అభ్యంతరాల స్వీకరణకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ఇప్పటికే ఉన్న 411 రోవర్లకు అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని పేర్కొన్నారు. భూ సర్వేలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారి సంతృప్తే ప్రాధాన్యంగా పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూ సమస్యలు లేని తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టిందని మంత్రి తెలిపారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో రెవెన్యూ అధికారులతో భూ సర్వే పురోగతిపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 10,954 రెవెన్యూ గ్రామాలకు గానూ తొలి దశలో హైదరాబాద్ మినహా మిగిలిన 32 జిల్లాలలో జిల్లాకు 70 గ్రామాల చొప్పున ఎంపిక చేసి, నక్షాలు అందుబాటులో లేని గ్రామాలను కూడా కలుపుకొని మొత్తం 2,720 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 285 గ్రామాల్లో సర్వే పూర్తయిందని వెల్లడించారు. భూమి రైతుకు కేవలం ఆస్తి మాత్రమే కాదని, అది అతని జీవనాధారమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి అంగుళం భూమికి స్పష్టమైన హద్దులు, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్, ప్రతి రైతుకు భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ యాజమాన్య హక్కులపై స్పష్టత తీసుకురావడంతో పాటు తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు పరిష్కారం చూపడంలో సమగ్ర రీసర్వే కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ 1936 నాటి నిజాం కాలం సర్వే రికార్డులే ప్రధాన ఆధారాలుగా ఉన్నాయని, కాలక్రమేణా భూముల విభజనలు, సర్వే నంబర్ల ఉపవిభాగాలు పెరగడం, పట్టణీకరణ విస్తరించడం, పరిపాలనా సరిహద్దుల్లో మార్పులు చోటుచేసుకోవడం వంటి కారణాలతో భూముల అసలు హద్దులపై స్పష్టత కొరవడిందన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర రీసర్వే చేపడుతున్నట్లు వివరించారు.

గతంలో భూముల కొలతలకు ఉపయోగించిన గొలుసులు, కర్రలు, క్రాస్‌స్టాఫ్, మెజరింగ్ టేపుల వంటి సంప్రదాయ పరికరాలకు స్వస్తి పలుకుతూ డీజీపీఎస్, రోవర్లు, జీఐఎస్, క్యూజీఐఎస్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. వీటి ద్వారా భూముల కొలతల్లో కచ్చితత్వం పెరగడంతో పాటు సర్వే వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి, భవిష్యత్తులో సరిహద్దులపై వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన సాంకేతిక పరికరాలను సమకూరుస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశామని, అదనంగా మరో 400 రోవర్ల కొనుగోలుకు టెండర్లు ఖరారయ్యాయని వెల్లడించారు. రోవర్ల వినియోగంతో భూముల సర్వేను వేగంగా, కచ్చితత్వంతో నిర్వహించేందుకు వీలవుతుందని చెప్పారు.

రీసర్వే పూర్తయిన తర్వాత ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులను నిర్ణయించి, ప్రతి సర్వే నంబర్‌కు ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆధార్ తరహాలో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చేలా భూదార్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. డీజీపీఎస్ ద్వారా సేకరించిన సర్వే సమాచారాన్ని క్యూజీఐఎస్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేసి భూ భారతి పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నంబర్లు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 2 కోట్ల 29 లక్షలకు పెరిగిందని వివరించారు. రాష్ట్రంలోని అన్ని సర్వే నంబర్లకు దశలవారీగా భూదార్ నంబర్లు కేటాయించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ రూపొందించిందని తెలిపారు.

త్వరలో పాలేరులో భూదార్ పట్టాల పంపిణీ

రీసర్వే ద్వారా ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు, ప్రత్యేక సర్వే పటాలు సిద్ధమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా భూ యాజమాన్య హక్కులపై స్పష్టత పెరగడంతో పాటు భవిష్యత్తులో భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల సమయంలో ఎదురయ్యే సమస్యలను తగ్గించేందుకు వీలవుతుందన్నారు.

తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని నేలకొండపల్లి మండలం కొంగర గ్రామ పరిధిలో ఉన్న మొత్తం 665 ఎకరాలలో వందశాతం రీసర్వేను విజయవంతంగా పూర్తిచేశామని త్వరలో భూదార్ పట్టాల పంపిణీ చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. భూ రీసర్వేలో అధికారులు తప్పనిసరిగా అనుసరించాల్సిన విధానాలపై మంత్రి గారు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల్లో సర్వే నిర్వహించేందుకు వెళ్లే ముందు సంబంధిత పట్టాదారులకు విధిగా ముందస్తు నోటీసులు ఇవ్వాలని సూచించారు. సర్వే నిర్వహించే విషయం భూయజమానులకు ముందుగానే తెలియజేయడం ద్వారా వారు అందుబాటులో ఉండి తమ భూముల హద్దులను నిర్ధారించుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. సర్వేకు ఒకటి రెండు రోజుల ముందు ఆయా గ్రామాల్లో తప్పనిసరిగా చాటింపు చేయాలని సూచించారు.అదేవిధంగా, గ్రామాల్లోని ప్రభుత్వ భూములకు స్పష్టమైన మార్కింగ్ చేయాలని, గ్రామకంఠం హద్దులను నిర్ధారించిన తర్వాతే సర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠం పరిధులవిషయంలోఎలాంటిగందరగోళానికితావులేకుండా క్షేత్రస్థాయిలో స్పష్టత తీసుకురావాలని సూచించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ యజమానుల అభ్యంతరాలను నిబంధనల ప్రకారం స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలని మంత్రి తెలిపారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూ రీసర్వేను అధికారులు కేవలం ప్రభుత్వ విధిగా భావించకుండా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అత్యంత కీలక బాధ్యతగా గుర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో, అంకితభావంతో పనిచేసి రీసర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. సర్వే సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూ యజమానులు సంతృప్తి చెందేలా ప్రతి చర్య చేపట్టాలని స్పష్టం చేశారు. ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజా కోణంలోనే ఆలోచించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు.

# ఏలేశ్వరం కాంగ్రెస్ చైర్ పర్సన్ అభ్యర్థిగా ఏడిద లోవలక్ష్మి సత్యనారాయణ

**పెన్ పవర్, అక్టోబర్ 17 :**

ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థిగా ఏడిద లోవలక్ష్మి సత్యనారాయణను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది.ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు శనివారం స్థానిక షిరిడి నగర్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి అభ్యర్థిని ప్రకటించారు.ఈ సందర్భంగా ఉమ్మడి వెంకట్రావు మాట్లాడుతూ మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు, మాజీ ఎంపీ హర్ష కుమార్ ఆదేశాల మేరకు ఏలేశ్వరం మున్సిపాలిటీ ఎన్నికలకు రంగం సిద్ధం చేశామన్నారు. ఇందులో భాగంగా చైర్ పర్సన్ అభ్యర్థిని ఎంపిక చేయడం జరిగిందన్నారు.





ఆదివారం నామినేషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు షిరిడి నగర్ కార్యాలయం నుండి నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్య ప్రకాశరావు, రామకుర్తి సూర్యనారాయణ, గుణాపు శ్రీను, దొంతంశెట్టి చంద్రశేఖర్, ఆలేటి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హెడ్‌లైన్: తిరుపతిలో వైసీపీ నేతలపై పోలీసుల కేసుల నమోదు



**అక్టోబర్ 17 (పెన్ పవర్):**
ఏపీలోని తిరుపతిలో స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో వైయస్సార్‌సీపీ సీనియర్ నేత భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు అభిషేక్ రెడ్డిలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ వినోద్ కుమార్ మరియు కానిస్టేబుల్ విజయ్ కుమార్ చేసిన ఫిర్యాదుల మేరకు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు దాఖలయ్యాయి. అయితే, నామినేషన్ల సమయంలో తమను అడ్డుకున్న టీడీపీ నేతలపై మాత్రం పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపణలు వస్తున్నాయి.

## కర్నూలు మేయర్ బరిలో అత్తాకోడళ్లు!



**అక్టోబర్ 17 (పెన్ పవర్):**
ఏపీలోని కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఆసక్తికరమైన రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఎన్నికల్లో టీడీపీ మేయర్ అభ్యర్థిగా విజయ ప్రత్యూష, వైయస్సార్‌సీపీ అభ్యర్థిగా సుశీల పోటీ చేస్తున్నారు. వీరు వరుసకు అత్తాకోడళ్లు కావడం గమనార్హం. విజయ ప్రత్యూష సోదరి ప్రియాంక, సుశీల కుమారుడిని వివాహం చేసుకోవడంతో ఇరు కుటుంబాల మధ్య బంధుత్వం ఏర్పడింది. రెండు ప్రధాన పార్టీల తరఫున వీరు బరిలో ఉండటంతో, రాజకీయ వర్గాల్లో మరియు ప్రజల్లో ఈ అత్తాకోడళ్ల పోటీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

## మాజీ డిప్యూటీ సీఎం సమక్షంలో వైసీపీలో చేరికలు

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**
ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా, కురుపాం నియోజకవర్గంలో కూటమి పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. కొమరాడ మండలం కోర్టు పంచాయతీ, రాయపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం టీడీపీని వీడి వైయస్సార్‌సీపీలో చేరాయి. చినమేరంగిలోని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. పార్టీలో చేరిన వారికి ఆమె సాదరంగా ఆహ్వానం పలికారు.



## శ్రీరాములపల్లెలో శ్రీ దుర్గేశ్వరి మాతకు ప్రత్యేక పూజలు









**అక్టోబర్ 17 (పెన్ పవర్):**
అన్నమయ్య జిల్లా దసరా శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని రామసముద్రం మండలం ఆర్. నడింపల్లి గ్రామ పంచాయతీ శ్రీరాములపల్లె గ్రామం లోని శ్రీ దుర్గేశ్వరి మాత ఆలయంలో శనివారం ఆలయ పూజారి మంగమ్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద పచ్చని తోరణాలు కట్టి, విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు,భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు ఈ సందర్భంగా బిల్డర్ కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి వేడుకలు మాకుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శ్రీ దుర్గేశ్వరి మాతను దర్శించుకుంటామని ,అమ్మవారి ఆశీస్సులతో వర్షాలు సంవృద్ధి గా కురిసి పాడి పంటలు బాగా పండి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయానికి వచ్చిన భక్తులతో పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.ప్రత్యేక ఆకర్షణ పూజారి మంగమ్మ మనవరాళ్లు( చిన్నారులు )అమ్మవారి వేసాధారణ తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది

ఈ కార్యక్రమంలో పూజారులు మంగమ్మ శాంతప్ప, వెంకటప్ప, రామలక్ష్మి కృష్ణమూర్తి, శోభ, ప్రశాంత్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## చింతలూరులో దుర్గాదేవి అమ్మవారి వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి





**అక్టోబర్ 17 (పెన్ పవర్):**
జగిత్యాల జిల్లా, రాయికల్ మండలం చింతలూరు గ్రామంలో నెలకొల్పిన దుర్గాదేవి మండపం వద్ద చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొని చిన్నారులకుఅక్షరాభ్యాసంచేయించారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా చిన్నారులకు విద్యాభ్యాసం ప్రారంభించడం ఆనవాయితీగావస్తోందని, విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ వనిత రమేష్,నవదుర్గా సేవాసమితి సభ్యులు భక్తులు, పురోహితులు చెరుకు మహేశ్వర శర్మ, భవానీ దీక్ష స్వాములు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పట్టభద్రులారా.. ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించండి!
## నిరుద్యోగ యువత భవిష్యత్తు కోసం ప్రశ్నించే నాయకత్వాన్ని ఎన్నుకోండి!

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**
తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఉమ్మడి నల్గొండ--ఖమ్మం--వరంగల్ మరియు హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే ముందు ప్రతి నిరుద్యోగ పట్టభద్రుడు ఒక్కసారి ఆలోచించాలి.

ప్రియమైన నిరుద్యోగ మిత్రులారా!

మన చేతిలో ఉన్న ఓటు కేవలం ఒక గుర్తుకు వేసే ముద్ర మాత్రమేకాదు. అదిమనభవిష్యత్తునునిర్ణయించేశక్తి. మనస మస్యలను శాసనమండలిలో వినిపించే నాయకుడిని ఎన్నుకునే అవకాశం. మన కష్టాలను, మన కలలను, మన ఆకాంక్షలను ప్రతిబింబించే ప్రతినిధిని ఎంపిక చేసుకునేప్రజాస్వామ్యహక్కు. అందుకేరాబోయేపట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు ఓటు వేసే ముందు వారి గత పనితీరు, ప్రస్తుత వైఖరి, భవిష్యత్తు కార్యాచరణ గురించిఆలోచించాల్సినబాధ్యతప్రతిపట్టభద్రుడిపైఉంది.

మన చదువులకు విలువ ఎక్కడుంది?ఒక నిరుద్యోగ యువకుడు డిగ్రీ పూర్తి చేయడానికిఎన్నోకష్టాలు పడతాడు. తల్లిదండ్రులు తమ రెక్కల కష్టంతో అప్పులు చేసి చదివిస్తారు. కుటుంబానికి అండగా నిలవాలని, సమాజంలో గౌరవంగా జీవించాలని, ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకలలనునెరవేర్చాలనిఆశపడతాడు.

కానీచదువుపూర్తయినతర్వాతఉద్యోగంకోసంసంవత్సరాల తరబడిఎదురుచూడాల్సినపరిస్థితి ఏర్పడితే ఆ యువకుడి బాధను ఎవరు అర్థం చేసుకుంటారు?

నోటిఫికేషన్లకోసంఎదురుచూపులు,పోటీపరీక్షలకోసంనిర ంతరశ్రమ,పరీక్షలనిర్వహణలోజాప్యాలు,నియామకప్రక్రి యలోసమస్యలు,కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై వివాదాలు, విద్యార్థులు ఉన్నప్పటికీ తగిన అవకాశాలు లభించకపోవడం వంటి సమస్యలు యువతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉద్యోగం అనేది కేవలం ఒక వ్యక్తి జీవనోపాధి మాత్రమే కాదు. అది ఒక కుటుంబానికి భరోసా, ఒక తల్లిదండ్రికి గర్వకారణం, ఒక యువకుడికి ఆత్మగౌరవం.

అధికార పార్టీ అయినా.. ప్రతిపక్ష పార్టీ అయినా ప్రశ్నించాల్సిందే!ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న పార్టీని ప్రశ్నించడం ఎంత ముఖ్యమో, ప్రతిపక్ష పార్టీల బాధ్యతను కూడా అంచనా వేయడం అంతే ముఖ్యం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించాలి. ఉద్యోగ నియామకాల విషయంలో సాధించిన పురోగతి ఏమిటి? పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటి? నిరుద్యోగులకుఉపాధిఅవకాశాలు కల్పించేందుకు రూపొందించిన కార్యాచరణ ఏమిటి? అనే అంశాలను పరిశీలించాలి. అదేవిధంగాప్రతిపక్షపార్టీలను కూడా ప్రశ్నించాలి. వారు అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి ఏం చేశారు? ప్రస్తుతం యువత సమస్యలపై ఎంత చిత్తశుద్ధితో పోరాడుతున్నారు? వారి హామీలకు ఆచరణ సాధ్యమైన ప్రణాళికలు ఉన్నాయా? ఎన్నికల సమయంలో మాత్రమే నిరుద్యోగ యువత గుర్తుకు రావడం సరైన రాజకీయ సంస్కృతి కాదు. యువతసమస్యలపైనిరంతరంపోరాడేనాయకత్వమేసమా జానికిఅవసరం. మనకు కావాల్సింది పార్టీల పేర్లు చూసి ఓట్లు అడిగే నాయకులు కాదు.. పట్టభద్రుల సమస్యలను అధ్యయనంచేసి, వాటిపరిష్కారంకోసంబాధ్యతాయుతంగా పోరాడే ప్రతినిధులు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అంటే కేవలం ఒక పదవి కాదు!పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సాధారణ రాజకీయ ఎన్నికలతో పోలిస్తే ప్రత్యేకమైన ప్రాధాన్యతను కలిగి ఉంటాయి. ఈ ఎన్నికల్లో ఓటు వేసే పట్టభద్రులు తమ వ్యక్తిగత ప్రయోజనాలకే కాకుండా విద్య, ఉద్యోగాలు, యువత భవిష్యత్తు, ప్రభుత్వ నియామకాలు వంటి విస్తృత అంశాలను కూడా దృష్టిలో ఉంచుకోవాలి. ఎమ్మెల్సీగాఎన్నికయ్యేవ్యక్తిశాసనమండలి లో పట్టభద్రుల సమస్యలను ప్రస్తావించాలి. ప్రభుత్వ విధానాలపైప్రశ్నించాలి. నిరుద్యోగులకున్యాయం జరిగేలా సంబంధితఅంశాలనుప్రభుత్వందృష్టికితీసుకెళ్లాలి. ఉద్యోగ నోటిఫికేషన్లవిడుదల, ఖాళీల భర్తీ, నియామక ప్రక్రియలో పారదర్శకత, నిరుద్యోగులకున్యాయమైనఅవకాశాలు, విశ్వ విద్యాలయాల అభివృద్ధి, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతంవంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే ఇవన్నీ కేవలం ఎన్నికల ప్రచారంలోచేసే వాగ్దానాలుగా మిగిలిపోకూడదు. ఎన్నికల అనంతరం కూడా నిరంతర పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన కార్యాచరణ ఉండాలి. నిరుద్యోగ యువత రాజకీయ చైతన్యంతో ముందుకు రావాలి!నిరుద్యోగులారా.. మన సమస్యలను మరొకరు వచ్చి పరిష్కరిస్తారని ఎదురుచూడటం మాత్రమే సరిపోదు. మన హక్కుల గురించి మనం తెలుసుకోవాలి. మన సమస్యలను మనమే ప్రశ్నించాలి. మనభవిష్యత్తును ప్రభావితంచేసేనిర్ణయాల్లోచైతన్యవంతమైనపాత్రపోషించా లి. ఎన్నికల సమయంలో డబ్బు, వ్యక్తిగత ప్రలోభాలు, కులం, మతం, ప్రాంతం లేదా పార్టీ అభిమానం ఆధారంగా కాకుండా అభ్యర్థి అర్హత, నిజాయితీ, ప్రజా సమస్యలపై అవగాహన, గత పనితీరు, భవిష్యత్తు కార్యాచరణ ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి.

ఎవరుమనసమస్యలనునిజంగాఅర్థం చేసుకుంటున్నారు? ఎవరు నిరుద్యోగుల తరఫున నిలబడగలరు? ఎవరి హామీలకు స్పష్టమైన కార్యాచరణ ఉంది? ఎవరు ఎన్నికల తర్వాత కూడా ప్రజలకు అందుబాటులో ఉంటారు? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి. ఓటు వేయడం మన హక్కు సరైన అభ్యర్థిని ఎంచుకోవడంమనబాధ్యత. ప్రశ్నించేనాయకుడినిఎన్నుకో వడం మన భవిష్యత్తుకు అవసరం. ఈసారి ఓటు మన భవిష్యత్తు కోసం!ఉమ్మడి,నల్గొండ--ఖమ్మం--వరంగల్, హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగిన ప్రతిపట్టభద్రుడూఈఎన్నికలనుఆలోచనాత్మకంగాతీసుకో వాలి. ప్రభుత్వంలోఉన్నవారైనా,ప్రతిపక్షంలో ఉన్నవారైనా ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. హామీలు ఇచ్చినవారు వాటి అమలు గురించి సమాధానం చెప్పాలి. నిరుద్యోగుల సమస్యలను రాజకీయ లబ్ధి కోసం కాకుండా నిజమైన ప్రజా సమస్యలుగా చూడాలి. మన ఓటు విలువను గుర్తించాలి. మన ప్రశ్నలకు సమాధానాలు కోరాలి. అభ్యర్థుల హామీలను పరిశీలించాలి. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి నిర్ణయం తీసుకోవాలి. ఎందుకంటే ఈరోజు మనం వేసే ఓటు రేపటి యువతకు ఎలాంటి అవకాశాలు ఉండాలనే దానిపై కూడా ప్రభావం చూపుతుంది.

**నిరుద్యోగ మిత్రులకు విజ్ఞప్తి!**

రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ అయినా, ప్రతిపక్ష పార్టీలైనా.. ఎవరికైనా ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించండి.

మన ఉద్యోగాల గురించి ఎవరు మాట్లాడుతున్నారు? మన సమస్యల పరిష్కారం కోసం ఎవరు పోరాడుతున్నారు?మన హక్కుల కోసం ఎవరు నిలబడుతున్నారు?ఎన్నికల తర్వాత కూడా మనకు అందుబాటులో ఉండే నాయకుడు ఎవరు?

ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకున్న తర్వాతే మీ ఓటుపై నిర్ణయం తీసుకోండి.

మన,ఓటుఅమ్ముడుపోకూడదు.. మన ఆత్మగౌరవం తలవంచకూడదు.. మన భవిష్యత్తు రాజకీయ హామీలకు బలికాకూడదు!పార్టీ ఏదైనా కావచ్చు.. అభ్యర్థి ఎవరైనా కావచ్చు.. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి, ప్రజలకు జవాబుదారీగా ఉండే నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వండి. ఓటు అనేది ఐదేళ్ల రాజకీయ భవిష్యత్తును మాత్రమే కాదు.. మన హక్కుల కోసం ప్రశ్నించే గొంతును కూడా నిర్ణయిస్తుంది. కాబట్టి పట్టభద్రులారా.. ఆలోచించి ఓటు వేయండి.. ప్రశ్నించే నాయకత్వాన్ని ఎంచుకోండి.. నిరుద్యోగ యువత భవిష్యత్తుకు బాటలు వేయండి.

## ధర్మాజీపేట్ గాంధీ తాండా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా!!సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**
జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ని రాయికల్ మండలం ధర్మజీపేట గాంధీ తాండాకు చెందిన నూతన లంబాడీ సంఘం పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన లంబాడీ సంఘంఅధ్యక్షులుగుగ్లావత్‌రాజునాయక్‌ఉపాధ్యక్షులు అజ్మీరా రాజేష్ పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్‌శభాకాంక్షలుతెలిపిఅభినందించారుగాం ధీ తాండా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, తాండాలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. తాండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, మాజీ సర్పంచ్ హరీష్, రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజ శేఖర్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, తట్లవాయి సర్పంచ్ మల్లేశం,భూక్యా తిరుపతి, అంగోత్ తిరుపతి వార్డు మెంబర్ , బాంద్రా రమేష్, తదితరులు పాల్గొన్నారు.





## జగిత్యాల ఫాక్స్ చైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు, నూతనకార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్





**అక్టోబర్ 17 (పెన్ పవర్):**
జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ కొలుగూరి దామోదర్ రావు, నూతనకార్యవర్గ సభ్యులు,మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం ప్రమాణ స్వీకార మహోత్సవానికి జగిత్యాల పట్టణ ఎల్ఎల్ గార్డెన్స్ లో రైతు సేవా సంకల్ప సభ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాల ముకుందం రౌతు గంగాధర్ రవీందర్ రావు మాజీ జడ్పీటీసీ పెండెం రాములు మాజీ ఏఎంసీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి మాజీ పాక్స్ చైర్మెన్ సదాశివ రావు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్ కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ చిక్కుల భూమయ్య పాక్స్ డైరెక్టర్ లు అదరవేని రాజయ్య,మంచాల మల్లేశం,నట్టి వెంకటేశం,బల్లనిసారయ్య,రేగుంటదుబ్బవ్వ,పునుగోటి పురుషోత్తం రావు,నీరటి గంగారెడ్డి,జుంబర్తి శంకర్,బొల్లె గంగయ్య,కేతిరెడ్డి,సత్యనారాయణరెడ్డి,నాగిరెడ్డిగంగారెడ్డి, చమిల్ల మంజుల,కౌన్సిలర్ లు సర్పంచులు రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ తయారీకి షుగర్ వాడకంపై నిషేధం.. రానున్న రోజుల్లో తగ్గనున్న చక్కెర ధరలు

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

దేశవ్యాప్తంగా నిత్యం పెరుగుతున్న చక్కెర ధరలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా, ఇథనాల్ తయారీ ప్రక్రియలో చక్కెర, చెరుకు రసం, షుగర్ సిరప్ మరియు బి-హెవీ మొలాసిస్‌లను వినియోగించడాన్ని పూర్తిగా నిషేధిస్తూ ప్రభుత్వం అధికారికంగా తక్షణ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రధానంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ ఏడాది రుతుపవనాలలో తక్కువ వర్షపాతం నమోదైన కారణంగా చెరుకు సాగు విస్తీర్ణం తగ్గి, దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుగా ఉన్న చక్కెర ధరలు సామాన్యులకు భారంగా మారకుండా ఉండేందుకు కేంద్రం ఈ ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టింది. ఈ తాజా నిర్ణయం ద్వారా ఇథనాల్ ఉత్పత్తికి మళ్ళించబడే చక్కెర నిల్వలు తగ్గి, దేశీయ మార్కెట్‌కు తగినంత సరఫరా అందుబాటులోకి వస్తుందని



భావిస్తున్నారు. దీనివల్ల భవిష్యత్తులో చక్కెర ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టి, సామాన్యులకు, గృహిణులకు ఎంతో ఊరట లభించే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి ఇంటికి పోలీసులు.. మున్సిపల్ ఎని వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి ఇంటికి పోలీసులు.. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్నుకల నేపథ్యంలో ముందస్తు చర్యలు



**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

పల్నాడు జిల్లా, మాచర్ల వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంటికి పోలీసులు భారీగా చేరుకున్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న వేళ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు అత్యంత అప్రమత్తమై ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి పోలీసులు అధికారికంగా నోటీసులు జారీ చేశారు. ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు తీసుకుంటున్న ఈ ముందస్తు భద్రతా చర్యలు ప్రస్తుతం స్థానిక రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల సమయంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు.

## వెల్దండలో దసరా ఉత్సవాలకు ఘన ఏర్పాట్లు - సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం





**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

వెల్దండ గ్రామంలో దసరా ఉత్సవాల ఏర్పాట్లపై గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వేద పండితుల సలహాలు, సూచనల మేరకు పండుగ తేదీలను ఖరారు చేశారు. మంగళవారం 20వ తేదీన దసరా (విజయదశమి), బుధవారం నాడు ఎదురుకోళ్లు, గురువారం నాడు సద్దుల బతుకమ్మ వేడుకలను గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ మూడు రోజుల పాటు గ్రామంలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ ఆటపాటలు నిర్వహిస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి గిరి, ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లా దాచేపల్లిలో ఉద్రిక్తత.. నామినేషన్లకు వెళ్తున్న వైయస్సార్‌సీపీ అభ్యర్థుల అడ్డగింత!

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

పల్నాడు జిల్లా దాచేపల్లిలో రాజకీయంగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న వైయస్సార్‌సీపీ అభ్యర్థులను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, వైయస్సార్‌సీపీ నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం మరియు తోపులాట జరిగింది. పోలీసుల ఏకపక్ష తీరును తీవ్రంగా నిరసిస్తూ వైయస్సార్‌సీపీ అభ్యర్థులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.



## మాజీ మంత్రి శ్రీమతి విడదల రజిని గారిని మర్యాదపూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షేక్ కరీమూన్ గారు!



**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

ఈరోజు చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి షేక్ కరీమూన్‌గారు, పూర్వపు రాష్ట్ర మంత్రివర్యులు, వైయస్సార్‌సీపీ నాయుకురాలుశ్రీమతివిడదలరజినిగారిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా చిలకలూరిపేట పట్టణాభివృద్ధి, వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.

## హెడ్‌లైన్: కొవ్వూరు మున్సిపల్ ఎన్నికల్లో వెనక్కి తగ్గుతున్న వైసీపీ!

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మున్సిపల్ ఎన్నికల వేళ వైయస్సార్‌సీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కొవ్వూరు వైయస్సార్‌సీపీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఎంపికైన మన్నే పద్మ పోటీ నుండి తప్పుకోవడంతో, పార్టీ అధిష్టానం మరో అభ్యర్థిని వెతికే పనిలో పడింది. అదేవిధంగా, వార్డు సభ్యులు కూడా నామినేషన్లు వేసేందుకు వెనకడుగు వేస్తుండటంతో స్థానిక వైయస్సార్‌సీపీ నాయకులు తీవ్ర అయోమయంలో పడ్డారు. మరోవైపు, వైయస్సార్‌సీపీ నేతలు భారీగా టీడీపీలో చేరుతున్నట్లు సమాచారం వెలువడింది



## బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామంలో వైభవంగా శ్రీ అంకమ్మ తల్లి అభిషేక కార్యక్రమాలు.. కన్నుల పండువగా భక్తుల పూజలు

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

**పూజా కార్యక్రమాలు:**

బాపట్ల జిల్లా పరిధిలోని మార్టూరు మండలానికి చెందినచారిత్రాత్మకమరియుఆధ్యాత్మిక ప్రాధాన్యత గలద్రోణాదులగ్రామంలోగ్రామదేవత శ్రీ అంకమ్మ తల్లి అభిషేక కార్యక్రమాలు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. గ్రామంలోని భక్తులందరూ పవిత్రభావంతో, భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. వైభవంగా విశేష అభిషేకాలుద్రోణాదుల గ్రామంలో వెలసిన శక్తిస్వరూపిణి శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి వేదమంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. అర్చకులు శాస్త్రోక్తంగా అమ్మవారి మూలవిరాట్టుకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, గంగాజలం తదితర పవిత్ర ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం మరియు విశేష అభిషేకాలు ఘనంగా జరిపించారు. అభిషేకానంతరంఅమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో కూడిన పరిమళభరితమైన పుష్పాలు, పసుపు, కుంకుమలు, గాజులు సమర్పించి ప్రత్యేక



అలంకరణ చేశారు. నూతన వస్త్రాలు ధరించి భక్తులు అమ్మవారికి సాష్టాంగ నమస్కారాలు ఆచరించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. వడ్డిరాజుల ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లుఈ పవిత్ర అభిషేక మరియు పూజా మహోత్సవాలను గ్రామంలోని వడ్డిరాజులు అత్యంత ప్రతిష్టాత్మకంగా, కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి వడ్డిరాజు కులస్తులు అందరూ ఐక్యతతో ముందుకు వచ్చి అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, రంగురంగుల పూలతో అందంగా అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యంకలగకుండాప్రసాద వితరణ ఏర్పాట్లను అద్భుతంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారినిదర్శించుకునితీర్థప్రసాదాలుస్వీకరించారు.

గ్రామశ్రేయస్సుకోసమేపూజలుగ్రామంలోశాంతిభద్రతలు వర్ధిల్లి, పాడిపంటలు సమృద్ధిగా పండి, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలనే సదుద్దేశంతో ఈ అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు ద్రోణాదుల గ్రామంపై ఎల్లప్పుడూ ఉండాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వేడుకుంటూ ప్రత్యేక హోమాలు మరియు పూజలు జరిపించారు.

ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలి!

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

పెరిగిన బియ్యం ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారంనిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎం.డి. అక్బర్, న్యాయవాది ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగినబియ్యంధరలతో పాటు వంటనూనెలు, పప్పులు, కూరగాయల ధరలు సామాన్యుడి కుటుంబ బడ్జెట్‌పై భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ఖర్చులు, మరోవైపు



ఆసుపత్రి ఖర్చులు, మందుల ధరలు ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.

ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతపై తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బియ్యంతో సహా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందుబాటులో ఉంచాలని, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

## అన్ని అనుమతులు ఉన్న ఇంటి నిర్మాణాన్ని అడ్డుకుంటున్న మాగనూరు పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి.

**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

మాగనూరు మండల కేంద్రంలో సర్వేనెంబర్ 8లో సదరు ఇంటి యజమాని మంగలి అశోక్ ఇంటి నిర్మాణం కోసం అన్ని అనుమతులు పొంది పనులు ప్రారంభించారని అయితే పంచాయతీ కార్యదర్శి ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడం, నిర్మిస్తున్న గోడలను జెసిబి తో కూల్చి వేయడం దారుణమని సిపిఎం జిల్లా నాయకులుపుంజనూరుఆంజనేయులు విమర్శించారు. జెసిబితోదౌర్జన్యంగాఇంటినిర్మాణాలను కూల్చివేయడం ఎంతవరకుసభమనిఎంతోకష్టపడి,అప్పులుచేసుకొనిఇంటి నిర్మించుకుంటున్న సామాన్యులపైన దౌర్జన్యం చేయడం సరైంది కాదన్నారు. ఎవరి ప్రోద్భలంతో పంచాయతీ కార్యదర్శి పనిచేస్తున్నారో ఏమో కానీ ఇది సరైనది కాదని దౌర్జన్యానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి తిమ్మప్పను వెంటనే ఎంపీడీవో గారు



సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఇంటి నిర్మాణాలను కూల్చడం వలన ఇంటి యజమానికి తీవ్రంగా ఆర్థిక నష్టం కలిగిందని అట్టి నష్టపరిహారం పంచాయతీ కార్యదర్శి ద్వారా చెల్లింప చేయాలని ఎంపీడీవోను కోరారు.

అన్ని అనుమతులు ఉన్న ఇళ్లపై దౌర్జన్యం చేయడం మానుకోవాలన్నారు. సామాన్యులను ఇబ్బంది పెట్టే చర్యకు పూనుకుంటే పంచాయతీ కార్యదర్శి పైన పెద్ద ఎత్తునఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు .బాధిత కుటుంబముతో కలిసి ఆయన ఎంపిడిఓ శ్రీనివాస్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది.





## నడికుడ తలారి ముత్తన్న (55) ఖతార్ దేశంలో అనారోగ్యంతో మృతి అ కుటుంబానికి తెలంగాణ గల్ఫ్ సమితి ఆర్థిక భరోసా-ఖతార్‌లో తెలుగు సోదరుల సహకారంతో ముత్తన్న కుటుంబానికి రూ.1.20 లక్షల ఆర్థిక సహాయం అందజేత



**అక్టోబర్ 17 (పెన్ పవర్):**

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం నడికుడ గ్రామానికి చెందిన తలారి ముత్తన్న (55)గల్ఫ్ ఖతార్ దేశంలో అనారోగ్యంతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన తెలంగాణ గల్ఫ్ సమితి, తెలుగు సోదరుల సహకారంతో రూ. 1,20,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకుంది.

ముత్తన్న మృతి వార్తను కుటుంబ సభ్యులు తెలంగాణ గల్ఫ్ సమితి దృష్టికి తీసుకురాగానే సమితి ప్రతినిధులు స్పందించారు. ఖతార్‌లోని కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి, మృతదేహాన్ని త్వరితగతిన స్వగ్రామానికి తరలించేందుకు కీలకంగా కృషి చేశారు.

అనంతరం మృతుడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న సమితి, బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఖతార్‌లోని తెలుగు వారందరికీ ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేసింది

ఈ విజ్ఞప్తికి స్పందించిన పలువురు తెలుగు సోదరులు తమకు తోచినంత సహాయాన్ని అందించారు. ఈ




క్రమంలో తెలంగాణ గల్ఫ్ సమితి కార్యవర్గ సభ్యుడు అందుగుల రాకేష్ యాదవ్, గ్రామ పెద్దల సమక్షంలో బాధిత కుటుంబానికి రూ. 1,20,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రూ. 5 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా పరిహారం బాధిత కుటుంబానికి అందేలా చేయడానికి తెలంగాణ గల్ఫ్ సమితి తమ వంతు కృషిని కొనసాగిస్తుందని ప్రతినిధులు తెలిపారువిదేశాల్లో ఉపాధి కోసం వెళ్లిన కార్మికులు మృతి చెందినప్పుడు వారి కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక, మానసిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

కష్టకాలంలో మానవత్వంతో స్పందించి ఆర్థిక సహాయం అందించిన ఖతార్‌లోని తెలుగు సోదరులందరికీ తెలంగాణ గల్ఫ్ సమితి,సౌదీ అరేబియా రియాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ మచ్చా కృతజ్ఞతలు తెలిపారు

# పులివెందులలో హైటెన్షన్.. గాలిలోకి పోలీసుల కాల్పులు




**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:** మాజీ సీఎం జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్లు సందర్భంగా అధికార, విపక్షాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. దీంతో పరిస్థితులను అదుపు చేసేందుకు పోలీసులు ముందుగా టియర్ గ్యాస్ ప్రయోగించారని చెబుతున్నారు. అప్పటికీ ఉద్రిక్తతలు సద్దుమణగకపోవడంతో గాలిలోకి కాల్పులు జరిపారని చెబుతున్నారు. పోలీసులు ఆరు రౌండ్ల కాల్పులు జరపడంతో పలువురు గాయపడ్డారని అంటున్నారు. ఈ ఘటనకు అధికార టీడీపీదే బాధ్యత అంటూ ఎంపీ అవినాశ్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారనే సమాచారంతో ఆయన నామినేషన్ సెంటర్ వద్దకు వచ్చారు. పులివెందులలో హై టెన్షన్ నెలకొంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం కావడంతో ఈ స్థానంపై అధికార పార్టీ గట్టిగా ఫోకస్ చేసింది. పులివెందులలో గెలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తున్న విపక్ష వైసీపీ తన సర్వశక్తులు ఒడ్డుతోంది. దీంతో శనివారం నామినేషన్ల దాఖలు సమయంలో బలప్రదర్శనకు దిగిందని అంటున్నారు. దీంతో టీడీపీ శ్రేణులు కూడా భారీగానే తరలివచ్చినట్లు చెబుతున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారని ఆరోపిస్తున్నారు.

నామినేషన్ కేంద్రం వద్ద ఉన్న పోలీసులతోనే వైసీపీ నాయకులు గొడవ పడుతున్నారని తెలియడంతో పట్టణంలోనే ఉన్న ఎంపీ అవినాశ్ రెడ్డి హుటాహుటిన అక్కడకు చేరుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఎంపీ వచ్చిన తర్వాత గొడవ మరింత ఎక్కువ అయిందని అంటున్నారు. దీంతో పోలీసులు టియర్ గ్యాస్ తోపాటు గాలిలోకి కాల్పులు జరిపారని చెబుతున్నారు. ఈ ఘటనలో తమ కార్యకర్తలకు గాయాలు అయ్యాయని ఎంపీ అవినాశ్ రెడ్డి మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో పోలిసింగ్ అధ్వానంగా తయారైందని ఈ ఘటనతో రుజువైందని ఆయన విమర్శించారు. తాము పోలీసులతో పోరాడాల్సివస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు మున్సిపల్ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలపై సాధారణ ప్రజానీకం తీవ్ర ఆందోళనకు గురవుతోంది. నామినేషన్ల సమయంలోనే ఈ స్థాయిలో యుద్ధ వాతావరణం ఉండటంతో రానున్న రోజుల్లో పరిస్థితులు ఇంకెంత దారుణంగా తయారవుతాయోనని ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో ఎన్నికల సంఘం కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని చెబుతున్నారు. ఈ పరిస్థితులను అధిగమించి ఎన్నికలు శాంతియుతంగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# వంగవీటి బ్రాండ్ ఇక జనసేన సొంతం..

# డిప్యూటీ సీఎం ద్విముఖ వ్యూహం!

**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:** స్థానిక ఎన్నికల సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాజకీయ వ్యూహాలు ఆసక్తి రేపుతున్నాయి. పార్టీని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసుకోవడంతోపాటు తన సొంత సామాజిక వర్గం మొత్తాన్ని తనవైపు తిప్పుకునేలా పవన్ పావులు కదుపుతున్నారని అంటున్నారు. స్థానిక ఎన్నికలు పార్టీ శ్రేణుల కోసమేనని గతంలోనే చెప్పిన పవన్, కేడర్ కు గుర్తింపు, గౌరవం ఇచ్చేలా కీలకమైన స్థానాలను దక్కించుకున్నారని చెబుతున్నారు. కార్పొరేషన్లు, మున్సిపల్ చైర్మన్ స్థానాలతోపాటు ఆయా పట్టణ సంస్థల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ పదవులలో గౌరవప్రదమైన సంఖ్యలో స్థానాలు తీసుకుని పార్టీని పూర్తిస్థాయిలో విస్తరించేలా పవన్ అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు. ప్రధానంగా విజయవాడ కార్పొరేషన్ దక్కించుకున్న జనసేనాని ఆ స్థానంలో మేయర్ అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణను ఎంపిక చేయడంలో తిరుగులేని వ్యూహాన్ని రచించారని అంటున్నారు.



**విజయవాడ, వంగవీటి పవన్ ద్విముఖ వ్యూహం**

రాష్ట్రంలో కీలకమైన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ను పొత్తుల్లో భాగంగా దక్కించుకోవడం ద్వారా జనసేనాని వ్యూహం స్పష్టమవుతోందని అంటున్నారు. గోదావరి జిల్లాల తర్వాత కాపుల ప్రభావం ఎక్కువగా ఉండే విజయవాడ నగరంలో జనసేన జెండా ఎగరవేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఆ సామాజిక వర్గంపై బలమైన ముద్ర వేయాలని పవన్ భావిస్తున్నారని అంటున్నారు. అదే సమయంలో వంగవీటి బ్రాండ్ ను సొంతం చేసుకోవడం ద్వారా కాపుల్లో తన ఇమేజ్ మరింత పెంచుకునే దిశగా అడుగులు వేశారని చెబుతున్నారు. దీనివల్ల కాపు సామాజికవర్గాన్ని పవన్ ఆకర్షించారని అంటున్నారు. ఇప్పటికే ఆ సామాజికవర్గంలో పవన్ పట్ల సానుకూల వైఖరి ఉందని, తాజా నిర్ణయాల వల్ల చిన్న చిన్న అసంతృప్తులు ఉన్నప్పటికీ తొలగిపోయే పరిస్థితి ఉందని అంచనా వేస్తున్నారు.

**వంగవీటి ముద్రపై శాశ్వత పట్టు**

విజయవాడ మేయర్ గా వంగవీటి రాధాకృష్ణను నిలపడం ద్వారా పవన్ రాజకీయంగా పట్టు బిగించే వ్యూహాన్ని అమలు చేశారని అంటున్నారు. రాష్ట్రంలో వంగవీటి బ్రాండ్ కు పార్టీలకు అతీతంగా అభిమానులు ఉన్నారని, ఇన్నాళ్లు తమ నాయకుడు వంగవీటి మోహనరంగా వారసులకు సరైన గుర్తింపు లేదని వారిలో ఆవేదన ఉండేదని అంటున్నారు. ఈ కారణంగా నామినేటెడ్ పదవుల పందేరం జరిగిన ప్రతిసారి వంగవీటి వారసుడిగా మాజీ ఎమ్మెల్యే రాధాకృష్ణ పేరు ప్రముఖంగా వినిపించేదని అంటున్నారు. అయితే రకరకాల సమీకరణాలతో వంగవీటి పేరు వెనక్కి వెళ్లిపోయేదని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో మేయర్ గా వంగవీటి రాధాకృష్ణ పేరు తెరపైకి తీసుకురావడమే కాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబును ఒప్పించారని చెబుతున్నారు. అదేసమయంలో వంగవీటిని టీడీపీ నుంచి జనసేనలోకి తీసుకురావడం కూడా పవన్ రాజకీయ చాణక్యానికి నిదర్శనంగా చెబుతున్నారు. దీనిద్వారా వంగవీటి బ్రాండ్ ను జనసేనాని సొంతం చేసుకున్నారని అంటున్నారు.

**విజయవాడ నగరంపై పట్టు**

రాష్ట్ర రాజకీయాల్లో విజయవాడ నగరం అత్యంత కీలకం. రాష్ట్ర రాజకీయాలకు విజయవాడే కేంద్రం. ఒకప్పుడు వ్యాపార, వాణిజ్య కేంద్రంగా విలసిల్లిన విజయవాడ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర రాజకీయాలకు కేంద్రంగా మారింది. రాజధానికి సమీపంలో ఉన్న ఈ నగరంలోనే పెద్ద సంఖ్యలో నేతలు, ఉద్యోగులు నివసిస్తున్నారు. దీంతో విజయవాడ నగరానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రాముఖ్యత పెరిగింది. ఇలాంటి నగరంపై జనసేన జెండా ఎగురవేస్తే ఆ ప్రభావం రాష్ట్రం మొత్తం ఉంటుందని జనసేనాని పవన్ వ్యూహాత్మకంగా అడుగులు వేశారని అంటున్నారు. అందుకే తమ పార్టీ నేతలు ఎక్కువగా మచిలీపట్నం కార్పొరేషన్ కావాలని తొలి నుంచి హడావుడి చేసినప్పటికీ పవన్ మౌనంగా తన వ్యూహాన్ని అమలు చేశారని అంటున్నారు. పార్టీ అవసరాల రీత్యా విజయవాడ జనసేనకే దక్కాలనే ఆలోచనతో ముందుగా సరైన అభ్యర్థిని వెతికి ఆ తర్వాత ఆయన పేరుతో టీడీపీని ఒత్తిడి చేశారని అంటున్నారు. దీంతో వంగవీటి విషయంలో టీడీపీ అధిష్టానం వ్యతిరేకించలేక విజయవాడ కార్పొరేషన్ ను జనసేనకు అప్పగించిందని చెబుతున్నారు.

## టీడీపీలో చిన్న శ్రీనుకు తొలి షాక్.. విజయనగరం మేయర్ అభ్యర్థి ఎంపికపై అనూహ్య నిర్ణయం



**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:** విజయనగరం మేయర్ సీటు ఎంపికపై టీడీపీ అనూహ్య నిర్ణయం తీసుకుంది. ఈ సీటు ఆశించి పార్టీలో చేరిన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చిన్న శ్రీనుకు షాక్ ఇచ్చిందని ప్రచారం జరుగుతోంది. చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర విజయనగరం మేయరుగా పోటీ చేయాలని భావించారని, ఈ కారణంగానే చిన్న శ్రీను టీడీపీలోకి వచ్చారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే టీడీపీ అధిష్టానం మాత్రం చిన్న శ్రీను కుమార్తెను కాదని పార్టీలో తొలి నుంచి కొనసాగుతున్న అవనాపు భార్గవికి అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం ఈ నిర్ణయం విజయనగరం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ అవుతోంది. మేయర్ ఎంపికలో స్థానిక ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు మాటకే అధిష్టానం ప్రాధాన్యం ఇచ్చిందని అంటున్నారు.

విజయనగరం మేయర్ అభ్యర్థిగా అవనాపు భార్గవిని ఎంపిక చేస్తూ టీడీపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం హాట్ టాపిక్ అవుతోంది. పార్టీపరంగా ఈ నిర్ణయాన్ని కార్యకర్తలు సమర్థిస్తున్నప్పటికీ, సీనియర్ నేత చిన్న శ్రీనుకు టీడీపీలో తొలి షాక్ ఎదురైనట్లుగా భావించాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. గత నెలలో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన చిన్న శ్రీనుకు టీడీపీ రాజకీయాలు ఎలా ఉంటాయో ఈ నిర్ణయం ద్వారా తెలియజేసినట్లైందని అంటున్నారు. వైసీపీలో ఉండగా సర్వం తానై వ్యవహరించిన చిన్నశ్రీనుకు టీడీపీలో అటువంటి జోరు చూపేందుకు అవకాశం ఉండదని అధిష్టానం సంకేతాలు పంపిందని అంటున్నారు. విజయనగరం మేయర్ సీటు జనరల్ మహిళకు రిజర్వు చేశారు. దీంతో చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్రకు లైన్ క్లియర్ అయినట్లే భావించారు. కానీ, పార్టీ అధిష్టానం అనూహ్యంగా బీసీ మహిళ అవనాపు భార్గవికి అవకాశం ఇచ్చింది. అవనాపు కుటుంబం తొలి నుంచి టీడీపీలో ఉండేది. 2004 తర్వాత కాంగ్రెస్ లోకి వెళ్లిన అవనాపు కుటుంబం గత ఎన్నికల ముందు తిరిగి టీడీపీలోకి వచ్చింది. రెండున్నరేళ్లుగా ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజుకు వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో అవనాపు భార్గవికి మేయర్ సీటు ఖరారు చేసినట్లుగా చెబుతున్నారు. దీంతో సీనియర్ నేత చిన్న శ్రీనుకు ఆశాభంగం తప్పలేదని అంటున్నారు. చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర మేయర్ గా పోటీ చేయాలని ఉవ్విళ్లూరారని అంటున్నారు. ఈ కారణంతోనే ఆమె గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టీడీపీలో చేరారని చెబుతున్నారు. అయితే టీడీపీలోకి కొత్తగా వచ్చిన సిరి సహస్రకు మేయర్ సీటు ఎలా ఇస్తారని పార్టీ వర్గాల నుంచి ప్రశ్నలు ఎదురయ్యాయని అంటున్నారు. ఇది గమనించే పార్టీలో తొలి నుంచి ఉన్నవారికి అవకాశం ఇచ్చారని అంటున్నారు. అయితే చిన్న శ్రీను తన కుమార్తెకు మేయర్ సీటు ఆశించిన విషయం వాస్తవమే అయినప్పటికీ టీడీపీలో చేరిన తర్వాత అటువంటి ప్రయత్నాలు ఏవీ చేయలేదని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. ఆయనకు ఏ పదవి ఇవ్వాలనే అంశాన్ని పార్టీ అధిష్టానం చూసుకుంటుందని, ఆ విషయంలో తమకు రెండో ఆలోచన లేదని అంటున్నారు. మొత్తానికి విజయనగరం మేయర్ సీటు ఎంపికతో చిన్న శ్రీను ఆశలు గల్లంతు చేశారన్న వాదనే ఎక్కువగా వినిపిస్తోంది.

# బీజేపీతో వైఎస్సార్‌సీపీ దోస్తీకి శాశ్వత ముగింపేనా?

**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:**

కాక్రోచ్ జనతా పార్టీ కీలక నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలల అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన ట్వీట్ జాతీయ రాజకీయాల్లో,సోషల్ మీడియా వేదికల్లో ఊహించని ప్రకంపనలు సృష్టిస్తోంది. ఢిల్లీ వేదికగా కేంద్ర ప్రభుత్వ వైఖరిపై, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ యంత్రాంగం, కేంద్ర ఎన్నికల సంఘం తీరును సిజేపీ తీవ్రంగావ్యతిరేకిస్తున్న వేళ.. జగన్ నేరుగా ఆ పార్టీ నేతలకు సానుభూతి తెలపడమే కాకుండా, సిజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, నేత అజింక్య షిండేలు ఆ ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ థ్యాంక్స్ చెప్పడం రాజకీయప్రాధాన్యతను సంతరించుకుంది. ఎలక్షన్ సిస్టమ్‌పై జగన్ చేసిన ఘాటు వ్యాఖ్యలు, పరోక్షంగా మోదీ ప్రభుత్వపు ముందస్తు అరెస్టుల వైఖరిని ఎండగట్టడం ఆయన తాజా రాజకీయ వ్యూహానికి నిదర్శనంగామారుతోంది. గతంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత, విపక్షాల నిరసన తీరును ప్రస్తావిస్తూ పరిస్థితులు ఇలాగే ఉంటే మేం కూడా కాక్రోచ్‌లం అవుతాం అని జగన్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే కాక్రోచ్ జనతా పార్టీ జాతీయ స్థాయిలో బీజేపీకి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో వీధిపోరాటాలు చేస్తుంటే జగన్ వారికి సంపూర్ణ అండగా నిలుస్తున్నారు.

ఈ పరిణామం వైఎస్సార్‌సీపీ కేవలం తాత్కాలిక నిరసనలకు పరిమితం కాకుండా, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన యాంటీ బేస్ ను నిర్మించుకోవడానికి మానసికంగా సిద్ధపడిందనే సంకేతాలను ఇస్తోంది. అయితే ఇక్కడే ఒక పెద్ద పొలిటికల్ వైరుధ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ఢీకొట్టడానికి జగన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరోవైపు జాతీయ స్థాయిలో బీజేపీతో వైరం పెట్టుకోకుండా, కేంద్ర దర్యాప్తు సంస్థల కేసులు, ఢిల్లీ మద్దతు కోసం గతంలో వ్యూహాత్మక మౌనం పాటించేవారు. కానీ ఇప్పుడు నేరుగా మోదీ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న, మోదీపై ఘాటు వ్యాఖ్యలు చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీకి నేరుగా మద్దతు ప్రకటించడం ద్వారా బీజేపీతో జగన్ బంధం ఇక పూర్తిగా తెగిపోయినట్లేనా అనే అనుమానాలు బలపడుతున్నాయి.

బీజేపీ విషయంలో పరోక్షంగా సైలెంట్‌గా ఉంటూనే, బీజేపీని తీవ్రంగా ఎండగట్టే తీవ్రవాద నిరసన గ్రూపులకు మద్దతివ్వడం వల్ల వైఎస్సార్‌సీపీ నైతికతపై సొంత పార్టీ శ్రేణుల్లోనే అనిశ్చితి నెలకొంటోంది. ఈ వైఖరివైఎస్సార్‌సీపీ రాజకీయ విశ్వసనీయతను ప్రశ్నించేలా చేస్తోందని భావిస్తున్నారు. అధికారం కోల్పోయిన తర్వాత ఓటు చోరీ, ఈవీఎంలు, కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాతం అంటూ జగన్ వరుసగా గొంతువిప్పుతున్నారు. కానీ, ఏపీలో 2019లో వైఎస్సార్‌సీపీ 151 సీట్లు గెలిచినప్పుడు లేని లోపాలు, 2024లో ఓడిపోగానే ఎన్నికల వ్యవస్థలోనే లోపాలు ఉన్నాయంటూ జగన్ మాట్లాడటాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుపడుతోంది. ఏపీ బీజేపీ నేతలు సైతం జగన్ వ్యాఖ్యలపై నిప్పులు చెరుగుతూ.. ఓడిపోతే వ్యవస్థ తప్పు, గెలిస్తే వ్యవస్థ ఒప్పా?" అంటూ ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై భిన్నమైన రాజకీయ చర్చ నడుస్తోంది. గతంలో కాక్రోచ్ జనతా పార్టీ నేత సౌరవ్ దాస్ స్వయంగా జగన్ కుటుంబానికి చెందిన భారతి సిమెంట్స్ , ఈడీ కేసులపై సంచలన ట్వీట్లు చేసిన అంశాలను నెటిజన్లు రీ-పోస్ట్ చేస్తున్నారు. గతంలో మిమ్మల్ని విమర్శించిన వారికే నేడు మద్దతు ఇస్తున్నారా? అంటూ నెటిజన్లు జగన్ ట్వీట్‌ను ప్రశ్నిస్తుంటే, మరొకవైపు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు మాత్రం ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడే ఎవరికైనా తమ నాయకుడు అండగా నిలుస్తాడని రీ-ట్వీట్లు చేస్తున్నారు. కాక్రోచ్ జనతా పార్టీకి బహిరంగ మద్దతు ఇవ్వడం ద్వారా జగన్ మోహన్ రెడ్డి ఒక పెద్ద పొలిటికల్‌గ్యాంబుల్ ఆడారని చెప్పవచ్చు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో ఉన్న సత్సంబంధాలను వదులుకుని, నేరుగా ఢిల్లీ స్థాయిలో విపక్షాల వైపు నిలబడే సంకేతాలు ఇవ్వడం వల్ల రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లోనే కాక, జగన్‌పై ఉన్న వివిధ కేంద్ర దర్యాప్తు కేసుల్లోనూ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉంది. మరి జగన్ ఇకపై నేరుగా బీజేపీతోనే ఢీకొట్టేందుకు పూర్తిస్థాయిలో రంగంలోకి దిగుతారో లేకవ్యూహాత్మక వెనకడుగు వేస్తారో వేచి చూడాల్సిందే.

# క్షేత్రస్థాయి ముచ్చెమటలు

**విజయవాడ అక్టోబరు 17 పెన్ పవర్:** లోకల్ పోల్స్ విషయంలో వైఎస్సార్‌సీపీ మునుపెన్నడూ లేనంత నీరసంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వంపై తాము పెద్ద ఎత్తున పోరాడుతున్నామని రంగుల కలలు కంటున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి, క్షేత్రస్థాయి రాజకీయ వాస్తవాలు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. మున్సిపల్ ఎన్నికల రేసులో మేయర్, మున్సిపల్ చైర్మన్ పీఠాలపై కేవలం ఎమ్మెల్యే స్థాయి లేదా అంతకంటే బలమైనముఖ్యనేతలనే అభ్యర్థులుగా నిలబెట్టాలని జగన్ ప్రణాళికలు రచించారు. కూటమిని ఢీకొట్టేందుకు సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా ఇంఛార్జ్‌లు అంతా ప్రత్యక్ష బరిలోకి దిగాలని తీవ్ర ఒత్తిడి తెచ్చారు. అయితే ఆయన పిలుపును ఖాతరు చేస్తూ పోటీకి సిద్ధమని ఒక్కరంటే ఒక్క ముఖ్యనేత కూడా ముందుకు రాకపోవడం పార్టీ అగ్రనాయకత్వానికి కోలుకోలేని షాక్ ఇచ్చింది. రాజకీయంగా కీలకమైన ప్రకాశంజిల్లా కేంద్రం ఒంగోలు కార్పొరేషన్‌లో బరిలో నిలిచేందుకు వైఎస్సార్‌సీపీ నుంచి ఒక్కటంటే ఒక్క ముఖ్యనేత కూడా ముందుకు రాలేదంటే ఆ పార్టీ పరిస్థితి ఎంతలా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అధికారంపోయాక కూటమి ధాటికి తట్టుకుని నిలబడే ధైర్యం లేక, పోరులో ఓటమి ఖాయమని ముందే తేలిపోవడంతో సీనియర్లంతా చేతులెత్తేశారు. నగరాల్లోనూ, మున్సిపాలిటీల్లోనూ ఆర్థికంగా, రాజకీయంగా అండగానిలవాల్సిన అగ్రనేతలు కాడిపడేయడంతో, వేరే దారి లేక వైఎస్సార్‌సీపీ ఆఖరి నిమిషంలో ద్వితీయ శ్రేణి నాయకులను, అనామక అభ్యర్థులను ఖరారు చేస్తూ జాబితాలు విడుదల చేయాల్సిన దుస్థితిఏర్పడింది. ఇక కనీసం సామాజిక సమీకరణాలైనా కాపాడుకున్నామని చెప్పుకోవడానికి, బీసీలకు, బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించామంటూ వైఎస్సార్‌సీపీ నేతలు సరికొత్త కప్పిపుచ్చే రాజకీయంమొదలుపెట్టారు. ప్రధాన నేతలు పోటీ నుంచి తప్పుకోవడంతో ఖాళీ అయిన స్థానాలను భర్తీ చేసేందుకు బలవంతంగా కొంతమంది ద్వితీయ శ్రేణి నేతలకు బి-ఫారాలు పంపిణీ చేస్తున్నారు. కానీ, నామినేషన్లఘట్టం ముగిసే వరకు ఈ అభ్యర్థులు నిజంగానే పోటీలో ఉంటారా లేక ఉపసంహరణ బాట పట్టి బరి నుంచి తప్పుకుంటారా అనేది పెద్ద ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ చివరిదాకా బరిలో నిలిచినా, అదికేవలం నామ్‌కే వాస్తే పోరాటమే తప్ప క్షేత్రస్థాయిలో గట్టిగా ప్రచారం చేసే శక్తి గానీ, వనరులుగానీ ఆ ద్వితీయ శ్రేణి నేతలకు లేవు. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగి, సొంత పార్టీ కేడర్‌ను గానీ, ద్వితీయ శ్రేణి నాయకులను గానీ కనీసం పట్టించుకోని జగన్ రెడ్డి విధానాలే ఇప్పుడు ఆ పార్టీకి శరాఘాతంగా మారాయి. మేయర్, చైర్మన్ సీట్లకే గతిలేక అభ్యర్థుల కోసం వెతుక్కునే దుస్థితి దాపురిస్తే, వార్డు స్థాయిలో డివిజన్లలో కూటమి అభ్యర్థులను ఎదుర్కొనే ధైర్యం ఎవరికి ఉంటుంది? యుద్ధరంగానికి సైన్యాన్ని నడిపించాల్సిన సేనాధిపతులే పారిపోతుంటే, ద్వితీయ శ్రేణి నేతలను బలిపశువులను చేస్తూ వైఎస్సార్‌సీపీ ఆడుతున్న రాజకీయం ఆ పార్టీకి మరింత ఇబ్బందికరమే.

ఆర్థిక సాయం చేస్తేనే పోటీ అంటున్న భాగ్యలక్ష్మి

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న అస్తవ్యస్త వ్యూహాలు ఆ పార్టీని పాతాళానికి తొక్కేస్తున్నాయి. ముఖ్యంగా కృష్ణా జిల్లా రాజకీయ కేంద్రమైనవిజయవాడ నగరపాలక సంస్థ మేయర్ పీఠం కోసం అభ్యర్థుల ఎంపిక ఆయన పలుకుబడి ఎంతటిదో తేల్చేసింది. ప్రధాన నేతలంతా పోటీకి ముఖం చాటేయడంతో చివరికి దిక్కుతోచక మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేరును బలవంతంగా తెరపైకి తెచ్చారు. అయితే నామినేషన్ల పర్వం ముంచుకొస్తున్న తరుణంలో ఆమె చేతులెత్తేయడంతో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ పెద్దలకు షాక్ తగిలినట్లయింది. నిజానికివిజయవాడ మేయర్ స్థానానికి రాయన భాగ్యలక్ష్మిని బరిలో దించే ఆలోచనే పార్టీ అధిష్టానానికి లేదు. ఎందుకంటే ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టి పోరాడే సత్తా, ఓట్లు రాల్చే బలమైన నాయకత్వం ఆమె వద్దలేదనే అంచనాతో పెద్దలంతా వేరే పేర్లపై కసరత్తు చేశారు. తొలుత యువనేత దేవినేని అవినాష్‌ను లేదా ఆయన సతీమణిని మేయర్ అభ్యర్థిగా నిలబెట్టాలని తీవ్రంగా ప్రయత్నించారు. ఆ తర్వాత మాజీమేయర్ కేశినేని శ్వేతను కూడా సంప్రదించి బతిమలాడి చూశారు. అంతిమంగా తానే జగన్ రెడ్డికి స్వయంగా బంధువునంటూ పార్టీలో సర్వస్వం తానేనని చెలామణి అయ్యే దేవినేని గౌతం రెడ్డి... తనకుమార్తెను బరిలో దించాలని పార్టీ నేతలు తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. కానీ ఎవరూ ముందుకు రాలేదు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలందరి గడప తొక్కి, కాళ్లబేరానికి వచ్చి మేయర్‌రేసులో నిలబడాలని కోరినా ఒక్కరంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదు. అధికారంలో ఉన్నప్పుడు కేడర్‌ను పట్టించుకోకపోవడం, ఇప్పుడు ఎన్నికల్లో కూటమి ప్రభంజనాన్ని తట్టుకుని నిలబడే ధైర్యం లేకఅందరూ చేతులెత్తేశారు. నేతలందరూ దండం పెట్టి పారిపోవడంతో చేసేది లేక, చివరికి ఎవరికైతే ఇవ్వకూడదు అనుకున్నారో అదే రాయన భాగ్యలక్ష్మిని పార్టీ అగ్రనేతలు బతిమలాడి మరీ అభ్యర్థిగాప్రకటించారు. అయితే ఈ నాటకీయ పరిణామాల మధ్య రాయన భాగ్యలక్ష్మి అకస్మాత్తుగా ప్లేట్ మార్చి వైఎస్సార్‌సీపీ పెద్దలకు షాక్ ఇచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి తన వద్ద చిల్లిగవ్వ లేదని, మీరే అన్నీసర్ది, డబ్బులు ముందుగా ఇస్తేనే తాను నామినేషన్ వేస్తానని తెగేసి చెప్పినట్లు సమాచారం. తనను అభ్యర్థిగా ఖరారు చేసి చేతులు దులుపుకోవాలని చూస్తే కుదరదని, ప్రచార ఖర్చులన్నీ పార్టీయేభరించాలని ఆమె నేతలను డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులు కరవై దిక్కుతోచని స్థితిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అధినాయకత్వానికి, భాగ్యలక్ష్మి చేసిన ఈ డబ్బుల డిమాండ్ మింగుడుపడకవిజయవాడ రాజకీయం రంజుగా మారింది.

# ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ ఎవరు? ద్రవిడ్, గిల్‌క్రిస్ట్, మోర్గాన్‌కు నో ఛాన్స్!



ఐపీఎల్ 2026లో ఎదురైన దారుణ వైఫల్యం (9వ స్థానం) తర్వాత ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ , హెడ్ కోచ్ మహేల జయవర్ధనే పరస్పర అంగీకారంతో విడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌కు తదుపరి ప్రధాన కోచ్‌గా ఎవరు వ్యవహరిస్తారనే అంశం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

**రేసు నుంచి తప్పుకున్న రాహుల్ ద్రవిడ్:**
టీమిండియాను 2024 టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిపిన రాహుల్ ద్రవిడ్ ముంబై ఇండియన్స్ కోచ్ రేసులో ఉన్నారనే ప్రచారాన్ని ప్రముఖ క్రికెట్ మీడియా సంస్థ క్రిక్‌బజ్ ఖండించింది.
కుటుంబానికి ప్రాధాన్యం: ద్రవిడ్ ప్రస్తుతం తన కుటుంబానికి, ప్రత్యేకించి తన కుమారులు (సమిత్, అన్వయ్) క్రికెట్ కెరీర్‌పై దృష్టి పెట్టాలని చూస్తున్నారు. 2026 సీజన్‌కు ముందే రాజస్థాన్ రాయల్స్ కోచ్ పదవి నుంచి తప్పుకున్న ద్రవిడ్‌కు ఐపీఎల్ లీగ్ నుంచి భారీ ఆఫర్లు వచ్చినప్పటికీ, ఆయన ఐపీఎల్ 2027 సీజన్‌లో కోచింగ్ బాధ్యతలు చేపట్టడానికి ఆసక్తిగా లేరని స్పష్టమైంది.
ఇదే బాటలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ కూడా తాము అందుబాటులో లేమని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు తెగేసి చెప్పారు.

**ముంబై ఇండియన్స్ కోచ్ రేసులో ఉన్నది వీళ్లే:**
మైఖేల్ హస్సీ : చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) బ్యాటింగ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్న హస్సీ, ఐపీఎల్ ఫ్రాంచైజీలతో చర్చలు జరుపుతున్నారు. ఆయన ముంబై ఇండియన్స్ రేసులో ప్రధానంగా ఉండే అవకాశం ఉంది.
ఆడ్రియన్ బిరెల్ : సౌతాఫ్రికాకు చెందిన ఈ సీనియర్ కోచ్ ప్రస్తుతం ఫ్రాంచైజీ క్రికెట్‌లో హాట్ కేక్‌లుగా మారారు. ూూ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టుకు ఏకంగా 3 టైటిళ్లు, 4 ఫైనల్స్ అందించారు.
ఆరోన్ ఫించ్ : ఆస్ట్రేలియా టీ20 ప్రపంచ కప్ విజేత కెప్టెన్ ఆరోన్ ఫించ్ కూడా కొన్ని ఐపీఎల్ జట్లతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

**కొత్త కోచ్ నిర్ణయంపైనే సపోర్ట్ స్టాఫ్ భవితవ్యం:**
ముంబై ఇండియన్స్ యాజమాన్యం తమ నూతన హెడ్ కోచ్ ఎంపిక కోసం త్వరలోనే ఇంటర్వ్యూలు ప్రారంభించనుంది.
కొత్తగా వచ్చే హెడ్ కోచ్‌కే ప్రస్తుత సపోర్ట్ స్టాఫ్ అయిన లసిత్ మలింగ, పారస్ మాంబ్రే (బౌలింగ్ కోచ్‌లు), కీరన్ పొలార్డ్ (బ్యాటింగ్ కోచ్), కార్ల్ హాప్‌కిన్సన్ (ఫీల్డింగ్ కోచ్)లను కొనసాగించాలా వద్దా అనే నిర్ణయాధికారాన్ని ఫ్రాంచైజీ వదిలేసింది.

# బుమ్రా ఇన్.. ఐదుగురు ఔట్! న్యూజిలాండ్ సిరీస్‌కు భారత టెస్ట్ జట్టులో భారీ మార్పులు



న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా నవంబర్ 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత జాతీయ ఎంపిక కమిటీ బీసీసీఐ ద్వారా 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. గత ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌తో పోలిస్తే, ఈ పర్యటన కోసం టీమిండియాలో ఏకంగా 5 కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. అందరి దృష్టిని ఆకర్షించిన ప్రధాన అంశం జస్‌ప్రీత్ బుమ్రా పునరాగమనం, మోకాలి గాయం కారణంగా లంక సిరీస్‌కు దూరమైన బుమ్రా, ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్ సాధించి కివీస్ గడ్డపై భారత పేస్ దళానికి నాయకత్వం వహించబోతున్నాడు.

**బౌలింగ్ విభాగంలో కీలక మార్పులు:**
న్యూజిలాండ్ వేగవంతమైన పిచ్‌లను దృష్టిలో పెట్టుకుని సెలెక్టర్లు ఐదుగురు ఫాస్ట్ బౌలర్లకు జట్టులో చోటు కల్పించగా, ముగ్గురు స్పిన్నర్లను మాత్రమే ఎంపిక చేశారు.
ఆకాశ్ దీప్ రీ-ఎంట్రీ: వెన్ను గాయం కారణంగా దాదాపు ఏడాది కాలంగా టెస్టులకు దూరంగా ఉన్న ఆకాశ్ దీప్ మళ్లీ టెస్టు జట్టులోకి వచ్చాడు.
అన్షుల్ కంబోజ్ కమ్‌బ్యాక్: ఇంగ్లాండ్‌పై మాంచెస్టర్ టెస్టులో ఆడిన తర్వాత జట్టుకు దూరమైన అన్షుల్ కంబోజ్ మళ్లీ సెలెక్టర్ల పిలుపునందుకున్నాడు.
సాయి సుదర్శన్, సుందర్ రీ-ఎంట్రీ: గాయాల కారణంగా శ్రీలంక టూర్ కు దూరమైన సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్‌లు తిరిగి తుది జట్టు రేసులోకి వచ్చారు.

**జట్టు నుంచి వైదొలిగిన ఐదుగురు ఆటగాళ్లు:**
శ్రీలంక సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్ మానవ్ సుతార్ కు కివీస్ కండిషన్స్ దృష్ట్యా చోటు దక్కలేదు. అలాగే సర్ఫరాజ్ ఖాన్, సారాంశ్ జైన్, గుర్నూర్ బ్రార్, ఆకిబ్ నబీలను ఈ పర్యటనకు పక్కనపెట్టారు.
**ఇన్** : జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, అన్షుల్ కంబోజ్.
**ఔట్** : మానవ్ సుతార్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, సర్ఫరాజ్ ఖాన్, సారాంశ్ జైన్.

**భారత టెస్టు జట్టు :**
శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ (ఫిట్‌నెస్‌కు లోబడి), ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, అన్షుల్ కంబోజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ (ఫిట్‌నెస్‌కు లోబడి), ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్.

# వాన దెబ్బకు ఐదో టీ20 రద్దు.. భారత్-విండీస్ సిరీస్ ఇలా ముగిసింది!



భారత్, వెస్టిండీస్ మధ్య జరగాల్సిన నిర్ణయాత్మక ఐదో టీ20 మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడ్డాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే రద్దయింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగిసింది. వర్షం అంతరాయం మధ్య కాసేపు సాగిన ఆటలో భారత బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించినా, చివరకు వరుణుడిదే పైచేయి అయింది.వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది.
టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (6), సంజు శాంసన్ (16) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యారు. ఇషాన్ కిషన్ (10 బంతుల్లో 30) మెరుపు దాడి చేశాడు. ఇషాన్ తన ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో అలరించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (14 బంతుల్లో 22) కూడా ధాటిగా ఆడడంతో స్కోరుబోర్డు పరుగులు పెట్టింది.
భారత ఇన్నింగ్స్‌లో 7.4 ఓవర్ల వద్ద తిలక్ వర్మ (7) ఐదో వికెట్‌గా ఔటైన వెంటనే వర్షం మళ్లీ మొదలైంది. అప్పటికి జట్టు స్కోరు 118 పరుగులు. అంతకుముందు క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ కేవలం 6 బంతుల్లోనే ఒక ఫోర్, మూడు సిక్సర్లతో 24 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. విండీస్ బౌలర్లలో కీమో పాల్, షమార్ స్ప్రింగర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.వర్షం ఎంతకీ తెరిపివ్వకపోవడంతో, మైదానాన్ని సిద్ధం చేసేందుకు సిబ్బంది ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అంపైర్లు ఇరుజట్ల కెప్టెన్లతో చర్చించి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. హోరాహోరీగా సాగుతుందని భావించిన సిరీస్ డిసైడర్ మ్యాచ్ ఇలా ముగియడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అనంతరం ఇరు జట్లు ట్రోఫీని పంచుకున్నాయి.

# మౌని రాయ్ కొత్త లుక్ చూసాక గుండె గల్లంతే!



అందాల నటి మౌనీ రాయ్ నిరంతరం తన ఇన్ స్టా పోస్టులతో యువహృదయాలను కొల్లగొడుతున్న సంగతి తెలిసిందే. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌తో సోషల్ మీడియాలో మరోసారి హల్‌చల్ చేశారు. ూా స్టోరియన్..బిసో.. బిసోవ్ ఎక్స్ అనే క్యాప్షన్‌తో మౌని షేర్ చేసిన ఫోటో క్షణాల్లోనే వైరల్‌గా మారింది. ఆకర్షణీయమైన లుక్‌తో ఉన్న ఈ ఫోటోను చూసి అభిమానులు, నెటిజన్లు లైకులు, గుండె గుర్తు ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను ముంచెత్తారు. ఈ పోస్ట్‌కు ఆమె తోటి సెలబ్రిటీల నుంచి కూడా విశేష స్పందన లభించింది. ప్రముఖ నటులు అర్జున్ బిజ్లానీ, అనుషా దండేకర్, అషీమా వర్దన్, ప్రముఖ స్టైలిస్ట్ అనుసోరు వంటి పరిశ్రమ స్నేహితులు ఫైర్, హార్ట్ ఎమోజీలను పోస్ట్ చేస్తూ ఆమె స్టైలింగ్- అందాన్ని ప్రశంసించారు. తోటి నటీనటులు, టెలివిజన్ ప్రముఖులు చూపిన ఈ ఆప్యాయత సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది .మౌనీ రాయ్ అభిమానులు, ఫ్యాన్ పేజీలు ఆమెను ఎంతగానో అభినందిస్తూ కామెంట్లు చేశారు. చాలామంది -రాకుమారి (షెహజాదీ)-, -డిస్నీ ప్రిన్సెస్-.. -దివా- అని అభివర్ణించారు. మౌని కేశాలంకరణ, దుస్తుల ఎంపికను మెచ్చుకుంటూ నెటిజన్లు ఆమెను ఫ్యాషన్ ఐకాన్‌గా అభివర్ణించారు. ఈ పోస్ట్ తో మౌని రాయ్ కు ఉన్న అంతర్జాతీయ, ప్రాంతీయ ప్రజాదరణ మరోసారి నిరూపితమైంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శుభాకాంక్షలతో పాటు, సొంత రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన అభిమానులు --సుభో శారదీయ-- అని బెంగాలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు చేశారు. భాషలు, సరిహద్దులతో సంబంధం లేకుండా మౌనీకి ఉన్న క్రేజ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది.మొత్తానికి ఒక్క పోస్ట్‌తో సోషల్ మీడియా వేదికగా ఈ స్థాయి స్పందన రావడం మౌనీ రాయ్ డిజిటల్ ఇంపాక్ట్ కి, స్టార్ డమ్‌కు అద్దం పడుతోంది. వెండితెరపైనే కాకుండా, సోషల్ మీడియాలోనూ తన విలక్షణమైన స్టైల్‌తో మిలియన్ల మంది అభిమానులను ఆకట్టుకుంటూ ఇంటర్నెట్ సెన్సేషన్‌గా కొనసాగుతున్నారు.





Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965